ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 27 సెప్టెంబరు 2024

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 26.0

ఆర్డీవోల బదిలీ

- భీమవరం : కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి
- తాడేపల్లిగూడెం : భవాని శంకరి
- నరసాపురం : దాసి రాజు
- ఏలూరు : అంబరీష్
- నూజివీడు : ఎం.వాణి

ఏలూరు సిటీ/ భీమవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని రెవెన్యూ డివిజన్లకు ఆర్డీవోలను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. సెలవులోవున్న తాడేపల్లిగూడెం ఆర్డీవో చెన్నయ్యను బదిలీ చేస్తూ ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో నూజివీడు డిప్యూటీ కలెక్టర్ వై.భవాని శంకరిని నియమించారు. భీమవరం ఆర్డీవో శ్రీనివాస్‌రాజు బదిలీపై కుప్పం వెళ్లగా, ఆయన స్థానంలో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ఉయ్యూరు ఆర్డీవోగా పనిచేస్తున్న దాసి రాజును నరసా పురం ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ పని చేస్తున్న అంబరీష్‌ను ఏలూరు ఆర్డీవోగా బదిలీ చేశారు. మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి నూజివీడు ఆర్డీవోగా బదిలీపై వచ్చారు.

సార్‌కు గిఫ్ట్ కొనాలి.. రూ.5వేలు ఇవ్వండి!

జీలుగుమిల్లి, సెప్టెంబరు 26 : 'సార్.. బదిలీ అయ్యారుగా.. ఆయనను గురువారం సన్మానిస్తున్నాం. వెండి, బంగారు వస్తువులను బహుమతిగా ఇస్తున్నాం. ఇందుకు ఒక్కొక్కరు ఐదు వేలకు తక్కువ కాకుండా ఇవ్వండి' అంటూ జీలుగుమిల్లి వెలుగు సిబ్బంది వసూళ్లకు పాల్పడడం వివాదాస్పదమైంది. సాధారణంగా ఓ అధికారి బదిలీ సమయంలో సిబ్బంది సన్మానించడం సహజమే. కాని, ఇక్కడ ఆ అధికారి బదిలీ వీవోఏలను ఇబ్బందుల పాలు చేసింది. వీవోఏలంతా ఐదు వేలు చొప్పున నగదు ఇచ్చారు. కాని ఓ వీవోఏ తన ఆర్థిక పరిస్థితి బాగా లేదని రూ.నాలుగు వేలే ఇచ్చింది. దీనిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐదు వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అసలే ఎనిమిది నెలలుగా జీతాలు రాని వీవోఏలు కొందరు అప్పులు చేసి మరీ చెల్లించారు. దీనిపై బదిలీ అయిన ఆ అధికారిని ఫోన్‌లో వివరణ అడగ్గా తనకు ఎటువంటి గిఫ్టులు ఇవ్వలేదని శాలువా కప్పి సత్కరించినట్టు చెప్పారు. కాని, వీవోఏలు మాత్రం తాము రూ.5 వేలు ఇచ్చినట్టు చెబుతున్నారు.

మూడు పదవులు.. మూడే నామినేషన్లు

- ఏకగ్రీవంగా ఏలూరు కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక
- అధికారికంగా త్వరలో ప్రకటన

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 26 : నగర పాలక సంస్థలో ఖాళీగా ఉన్న కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక కోసం నామినేషన్లు కోరగా మూడు పదవులకు ముగ్గురే నామినేషన్ వేయడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు టీడీపీకి చెందిన కొల్లేపల్లి రాజు, చోడే వెంకటరత్నం, జాలా సుమతి బాలాజీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురు వారం నామినేషన్లకు చివరి తేదీ కాగా ముగ్గురే నామినేషన్లు దాఖలు చేయడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది. షెడ్యూల్ ప్రకారం అధికారికంగా త్వరలో ప్రకటిస్తారు. నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు ముడిదే శ్రీనివాస్, నూకపేయి సుధీర్‌బాబు, రాజీనామాతో ఏర్పడిన ఖాళీల్లో టీడీపీకి చెందిన కార్పొరేటర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని శ్రీనివాస్‌లను డిప్యూటీ మేయర్లుగా ఎమ్మెల్యే చంటి ఎంపిక చేశారు. వీరి ఎన్నిక కూడా దాదాపు ఖాయమే. నగర పాలక సంస్థ మండలి విప్ పదవికి టీడీపీ సీనియర్ కార్పొరేటర్ తంగిరాల అరుణ సురేష్‌బాబును ఎంపిక చేశారు.

నీరు-ప్రగతి ఎస్ఈ బదిలీ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 26 : ఏలూరు నీరు-ప్రగతిలో ఎస్ఈగా పనిచేస్తున్న వై.శ్రీనివాస్‌ను విజయవాడ సీఏడీఏ కమిషనర్ కార్యాలయంలో ఎస్ఈగా బదిలీ చేశారు. ఏలూరులోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా పనిచేస్తున్న కె.రాజును విజయవాడలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి క్యాంప్ కార్యాలయంలో ఈఈగా బదిలీ చేశారు.

నేడు బాధ్యతలు చేపట్టనున్న జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్


ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26 : జిల్లా పరిశ్రమల అధికారి (జేడీ)గా బదిలీపై జిల్లాకు నియమితులైన ఇ.ప్రతాప్ శుక్రవారం బాధ్యతలను చేపట్టనున్నారు. ఇప్పటివరకు తిరుపతి జిల్లా పరిశ్రమల అధికారిగా పనిచేసిన ఈయనను జిల్లాకు బదిలీచేసిన విషయం విదితమే. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న జేడీ ఆదిశేషు విశాఖకు బదిలీ అయ్యారు. కాగా డీఐసీ లో విధులు నిర్వర్తిస్తున్న డీడీ, ఏడీ, ఐపీవోలు, సూపరిం టెండెంట్‌లందరూ బదిలీ కాగా గురువారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

కాల్వలకు మోక్షం!

కూటమి ప్రభుత్వం నిధుల కేటాయింపు


ఏలూరులో కృష్ణా కాల్వ

వైసీపీ ప్రభుత్వ హయాంలో జల వనరుల శాఖ పనులన్నీ మూలనపడ్డాయి. డెల్టా ఆధునికీకరణ పనులు అదృశ్యమయ్యాయి. మీడియం ప్రాజెక్టుల గేట్ల మరమ్మతు పనులు మొండికేశాయి. నిధులు కేటాయించక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. విదేశీ ఆర్థిక సాయం లభించే మరికొన్ని పనులకు అదికాస్తా అందకుండా పోయింది. ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓఅండ్ఎం) పనులు మూలనపడ్డాయి. ఇలా ఒకటికాదు రెండుకాదు.. ఇప్పుడు ఆ పనులన్నింటికీ కూటమి ప్రభుత్వం కొత్తగా నిధులు కేటాయించడం ఆరంభించింది. ఎట్టి పరిస్థితుల్లోను వంద రోజుల్లో లక్ష్యాన్ని నిర్దేశించి ఆ మేరకు పనులు ప్రారంభించాల్సిందిగా ఆదేశించింది.


తమ్మిలేరు ప్రాజెక్టు

- పనుల పూర్తి లక్ష్యం వంద రోజుల్లోపే..
- పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు
- పోలవరం కాల్వ గండ్లకు మరమ్మతులు
- మీడియం ప్రాజెక్టుల గేట్లకు నిర్వహణ పనులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వారు కావడంతో జిల్లాలోని ఇరిగేషన్ పనులన్నింటికీ కొత్తదనం ఆపాదిస్తున్నారు. నిర్లక్ష్యానికి తెరవేసి ఆ స్థానంలో చురుకుదనం రప్పిస్తున్నారు. లక్ష్యాలను చేరుకోవడంలో ఎక్కడా వెనుకబడ రాదంటూ ఇప్పటికే నిర్దేశం చేశారు. పశ్చిమ కృష్ణ కాల్వ, గోదావరి డెల్టా కాల్వ, తమ్మిలేరు జలాశయం ఆధునికీకరణ పనులు, ఆఖరుకి ఇప్పటికే మసక బారిన మరికొన్ని పనులకు అత్యవసర ప్రాతిపదికన పనులు చేపట్టి అదే క్రమంలో పూర్తి చేయాలని దిశ, నిర్దేశం చేశారు. ఈ తరహా పనులకుగాను తగిన నిధులను అందుబాటులోకి తెచ్చారు. సాధ్యమైనంత మేర క్రమపద్ధతిలో, ప్రాధాన్యత క్రమంలోనే పనులు పూర్తి చేసే దిశగా ఇప్పుడు జలవనరుల శాఖ అడుగులు వేస్తోంది. ఇన్నాళ్లు ఆ శాఖలో పనులు లేక కాస్తంత నిర్వేదం తొణికిసలాడుతూ కనిపించింది. ఇప్పుడు ఆ పరిస్థితి పోయి నీరు-చెట్టు పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఒకవైపు బిజీగా మారి, ఇంకోవైపు కొత్త పనులను పూర్తి చేసేందుకు జల వనరుల శాఖ పూర్తిగా సన్నాహాల్లో దిగింది.

మీడియం ప్రాజెక్టు గేట్లకు మోక్షం

ఇన్నాళ్లు మధ్యతరహా, చిన్న నీటి ప్రాజెక్టుల గేట్లకు కనీస నిర్వహణ లేకుండా గాలికొదిలేశారు. ఆయా గేట్ల నుంచి భారీగా నీరు లీకేజి కావడం, మరికొన్ని నిర్వహణ లోపాలతో పని చేయకపోవడం, ఇంకొన్ని సాంకేతిక కారణాలతో నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ పరిస్థితుల్లో గేట్ల నిర్వహణకు 34.04 లక్షల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. మీడియం ప్రాజెక్టులైన తమ్మిలేరు ప్రాజెక్టు గేట్లకు, కొవ్వాడ గేట్లకు ఈ నిధుల సాయంతో మరమ్మతు, నిర్వహణ చేపట్టబోతున్నారు. సాధ్యమైనంత మేర త్వరగానే ఈ పనులు పూర్తి చేసే దిశగానే జల వనరుల శాఖ పూర్తిగా అప్రమత్తమైంది. నిర్దేశించిన పనులను ఇప్పటికే లాంఛనంగా ఆరంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే తరహాలో పోలవరం కుడికాల్వకు మూడుచోట్ల పడిన లీకేజీ, గండ్ల మరమ్మతులకు మరో 48.15 లక్షల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది.

పనులన్నీ పూర్తి చేస్తాం : సిహెచ్.దేవప్రకాశ్, జల వనరుల శాఖ ఎస్ఈ



ఇప్పటికే జల వనరుల శాఖ పరిధిలో అనేక పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు నిధులు కేటాయించింది. సాధ్యమైనంత మేర వంద రోజుల వ్యవధిలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించింది. కృష్ణా కాల్వలో కిక్కిస, తూడు పూడిక పూర్తిగా తొలగిస్తున్నాం. ఇప్ప టికే తమ్మిలేరు ప్రాజెక్టు కింద జైకా నిధులను ఉపయోగించు కుని కొంతమేర పనులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. గేట్ల మరమ్మతులు, నిర్వహణ విషయంలోను జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఏదైతే నిర్దేశించిందో అదే ప్రాధాన్యత క్రమంలో పనులన్నీ పూర్తి చేసేందుకే సిద్ధంగా ఉన్నాం. అత్యవసర పనులను త్వరత్వరగా కొలిక్కి తెచ్చి తమ శాఖ పరిధిలో ఉన్న లక్ష్యాలకు అనుగుణంగా శరవేగంగా పనులు చేస్తాం.

కృష్ణా కాల్వకు ఏం చేయబోతున్నారంటే..

చాన్నాళ్ళుగా పశ్చిమ కృష్ణా కాల్వ నిర్వహణకు కనీస పనులు చేయలేదు. ఈ కాల్వ కృష్ణా జలాలను ఏలూరు నగరంలోని పంపుల చెరువు వరకు తాగునీటి జలాలను మోసుకొస్తుంది. ఇదేక్రమంలో మార్గమధ్యలో ఉన్న గ్రామాల్లో తాగు, సాగునీటి వనరులకు ఈ కాలువే ఆధారం. ఈ మధ్యకాలంలో పెదపాడు మండలంలో కృష్ణ కాల్వకు గండ్లు పడి కొంత విధ్వంసం జరిగింది. కాని వెంటనే ఈ గండ్లు పూడ్చివేత ముగిసింది. కృష్ణకాల్వ పరిధిలో 23 పనులు చేపట్టేందుకు ఇప్పటికే 460.21 లక్షల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. కాల్వలో కిక్కిస, పూడిక, తూడు తొలగింపునకు వీలుగా ఈ పనులన్నింటినీ త్వరితగతిన మూడు నెలల్లోపే పూర్తి చేయాలని లక్ష్యంగా తీసుకున్నారు. ఇన్నాళ్లు కృష్ణా కాల్వలో ఈ పనులు చేసేందుకు అప్పట్లో జగన్ సర్కార్ నయాపైసా విదల్చకుండా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న చొరవతో పనులన్నీ చకచకా పూర్తికానున్నాయి. అత్యవసరం ప్రాతిపదికన కృష్ణా ఈస్టన్ కాల్వ పరిధిలోని 21 పనులకు మరో 689.95 లక్షల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పనులన్నింటితో కృష్ణా కాల్వకు కాస్తంత మహర్దశ పట్టబోతుంది.

మరికొన్ని పనులకు నిధులు

ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న పనులన్నింటికీ తిరిగి పూర్తి చేసేందుకు రూ.90 కోట్ల వ్యయంతో కూడిన నిర్వహణ పనులను ఈ మధ్యనే ప్రభుత్వం ఆమోదించింది. ఎట్టి పరిస్థితుల్లో వీటిని సాధ్యమైనంత మేర పూర్తిచేసేందుకు సిద్ధపడుతున్నారు. బలివే వద్ద తమ్మిలేరుపై బ్రిడ్జి నిర్మాణం ఇప్పటికే 70 శాతం పూర్తికాగా మిగతా పనులన్నింటిని శివరాత్రిలోపు పూర్తి చేయబోతున్నారు.

ఎయిడెడ్‌కు.. కొత్త ఊపిరి



- కొన్ని పాఠశాలల్లో టీచరు నియామకాలకు అవకాశం
- కొత్తగా పోస్టులు అవసరమైతే ప్రభుత్వ 'సర్‌ప్లస్' ఉపాధ్యాయులతో సర్దుబాటుకు చాన్స్
- జగన్ దెబ్బకు ఎయిడెడ్ విధ్వంసం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26 : ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పలు కారణాలతో నియామకాలు నిలిచిన కొన్ని ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలపై స్పందించిన ప్రభుత్వం సంబంధిత విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ ఖాళీలను నింపేందుకు షరతులతో కూడిన అనుమతులు ఇవ్వనుంది. జిల్లాలోని భీమడోలు మండలం ఆగడాలలంక ప్రాథమిక పాఠశాలలో రెండు ఎస్జీటీ పోస్టులు, పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో సీబీసీఎన్‌సీ హైస్కూలులో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కలిపి 11, అదే యాజమాన్యానికి చెందిన మరో ప్రాథమిక పాఠశాలలో మూడు ఎస్జీటీ పోస్టుల భర్తీకి విద్యాశాఖ చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం. మరికొన్నింటిలోను టీచరు ఖాళీలను భర్తీచేసే అవకాశం లేకపోలేదు. ఈ ఖాళీలను సంబంధిత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని భర్తీని చేపడతారు. అయితే కేవలం కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసిన ఎయిడెడ్ పాఠశాలల్లో మాత్రమే ప్రస్తుతానికి నియామకాలు పరిమితమని తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారమేదీ తమవద్ద లేదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో ఎయిడెడ్ విలవిల

రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యాసంస్థల ఆస్తులపై కన్నేసిన గత వైసీపీ ప్రభుత్వం 2021లో తీసుకున్న నిర్ణయం మొత్తం ఎయిడెడ్ విద్యావ్యవస్థను భారీగా కుదిపేసింది. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వంలోకి విలీనం చేయాలంటూ బలవంతంగా ఒప్పించే ప్రయత్నం చేయడం అప్పట్లో పెద్ద దుమారాన్నే రేపింది. తగినంత మంది విద్యార్థులు లేరన్న సాకుతోనో, నిర్వహణ సరిగా లేదన్న కారణాలతోనో ఆస్తులతో సహా ప్రభుత్వానికి అప్పగించాలని షరతులు పెట్టింది. తన నిర్ణయాన్ని ఎలాగైనా అమలు చేసేందుకు ఉన్నతాధి కారులతో సంబంధిత ఎయిడెడ్ యాజమాన్యాలపై తీవ్రంగా ఒత్తిళ్లు తెచ్చింది. ఈ నేపథ్యంలో జగన్ ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ జిల్లాలో పలుచోట్ల ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు నిరసనలకు దిగిన విషయం విదితమే. దీంతో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడానికి బదులుగా రెండు ఆప్షన్ల విధానాన్ని తెరపైకి తెచ్చారు. ఆప్షన్-1 ప్రకారం ఎయిడెడ్ విద్యాసంస్థకు సంబంధించిన ఆస్తులు, అందులో పనిచేస్తున్న టీచర్లతో సహా ప్రభుత్వానికి అప్పగించాలి. ఈ ఆప్షన్‌కు అయిష్టంగానో, ఉన్నతస్థాయి నుంచి ఒత్తిళ్లమేరకో గాని ఉమ్మడి జిల్లాలో 8 పాఠశాలలు, 12 టీచరు పోస్టులను సంబంధిత యాజమాన్యాలు ప్రభుత్వానికి అప్పగించాయి. ఇక ఆప్షన్-2ని ఆమోదించిన 138 పాఠశాలల యాజమాన్యాలు ఆస్తులను తమవద్దే ఉంచుకుని, వాటిలో పనిచేస్తున్న 219 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వానికి అప్పగించాయి. ఇలా విలీనమైన వారందరినీ జీరో సర్వీసుతో ప్రభుత్వ పాఠశాలలకు 2022 మార్చిలో సర్దుబాటు చేశారు. జీరో సర్వీసు వల్ల అత్యధికంగా నష్టపోయిన టీచర్లలో ఆర్‌సీఎం యాజ మాన్యానికి చెందినవారే ఉన్నారు. వీరంతా కౌన్సెలింగ్‌లో సుదూరప్రాంతాలకు బదిలీపై వెళ్లాల్సివచ్చింది. కళాశాల విద్యలోనూ ఇదే దుస్థితి ఏర్పడింది. ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న పలువురు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రభుత్వానికి అప్పగించగా, వారిలో అత్యధికులు ఇతర జిల్లాలకు బదిలీ/సర్దుబాటుపై వెళ్లాల్సి వచ్చింది. మరోవైపు ప్రభుత్వ నిధులతో నడిచే సంబంధిత ఎయిడెడ్ కళాశాలలన్నీ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను వదులుకోవడంతో ఆయా కోర్సులకు ఫీజులు కొన్నిరెట్లు పెరిగాయంటూ విద్యార్థి సంఘాలు జగన్ ప్రభుత్వచర్యను బాహాటంగానే ఎండగట్టాయి. ఇప్పటికే ప్రభుత్వంలోకి విలీనం చేసిన ఎయిడెడ్ విద్యాసంస్థలకు కొత్తగా టీచరు పోస్టులను మంజూరు చేయడం లేదా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న (ఎయిడెడ్) టీచర్లను తిరిగి ఆయా పాఠశాలలకు వెనక్కి పంపడం గాని సాంకేతికంగా సాధ్యం కాదని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 'ఎయిడెడ్' పరిస్థితి ఇదీ..

ఏలూరు జిల్లాలో 18 ఎయిడెడ్ పాఠశాలలుండగా, మొత్తం 3,546 మంది విద్యార్థులున్నారు. వీటిలో 11 ప్రాథమిక పాఠశాలల్లో 50 శాంక్షన్డ్ ఎస్జీటీ పోస్టులకు ప్రస్తుతం 21 మంది వర్కింగ్ టీచర్లున్నారు. ఇక 7 ఉన్నత పాఠశాలల్లో 165 స్కూల్ అసిస్టెంట్ కేడర్ శాంక్షన్డ్ పోస్టులకు ప్రస్తుతం 58 పోస్టుల్లో మాత్రమే టీచర్లు పనిచేస్తున్నారు. చివరిసారిగా ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఉపా ధ్యాయ నియామకాలను 2003లో అప్పటి ప్రభుత్వం నిలిపివేసింది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 84 ఎయిడెడ్ యాజమాన్యాలు కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చు కోవడంతో తదుపరి సంవత్సరాల్లో కొన్నింటిలో నియామకాలు జరిగాయి. కొన్నిం టిలో పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా జరిగే ఎయిడెడ్ నియామకాలన్నీ ఇదే కోవ లోకి వస్తాయని తెలుస్తోంది. ఇప్పుడు కొత్తగా ఏదైనా ఎయిడెడ్ యాజమాన్యం తమకు టీచర్ పోస్టులు కావాలంటూ ప్రభుత్వాన్ని లేదా కోర్టుని ఆశ్రయిస్తే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్‌ప్లస్ (మిగులు)గా వున్న సుమారు 400 ఎస్జీటీ ఉపాధ్యాయులను సర్దుబాటుపై నియమించే అవకాశాలున్నట్టు సమా చారం. అయితే సంబంధిత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యపై ఆధార పడి ఉంటుంది. వీటన్నింటిపైనా ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాలో 14 ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలుండగా 2004 మంది విద్యార్థులున్నారు. మూడు యూపీ స్కూళ్లు ఉండగా 135 మంది విద్యార్థులు, 12 ప్రాథమిక స్కూళ్లు ఉండగా 421 మంది విద్యార్థులున్నారు.

సమ్మె విరమించిన వైద్యాధికారులు

- డీఎంహెచ్‌వో చర్యలపై కొంత అసహనం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26 : పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటా 30 శాతం కోసం గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల వైద్యాధికారులు ఈ నెల 17 నుంచి చేస్తున్న సమ్మెను గురువారం రాత్రి విరమించారు. ఈ విషయాన్ని ఏపీ పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రకుమార్ వెల్లడించారు. శుక్రవారం నుంచి విధులకు వైద్యాధికారులందరూ యదాతథంగా హాజరవుతారని వివరించారు. సమ్మె కాలానికి జీతభత్యాలను పూర్తిగా చెల్లించడం, రెగ్యులర్ సీనియార్టీకి కలపడం వంటి చర్యలకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఇంతకుముందు క్లినికల్ కోర్సుల్లో ఇన్‌సర్వీస్ కోటా కింద వున్న 30 శాతాన్ని ఇటీవల 15 శాతానికి తగ్గించడంతో పాటు, ఆరు స్పెషాల్టీలకే పరిమితం చేస్తూ జారీ చేసిన జీవో 85 ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలంటూ రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీల వైద్యాధికారులు సమ్మెకు దిగిన విషయం విదితమే. తాజాగా వైద్యుల సంఘం నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో క్లిని కల్ స్పెషాలిటీ కోర్సుల్లో ఇన్‌సర్వీస్ కోటాను 20 శాతానికి పెంచడానికి అంగీకరించడంతో పాటు, 19 రకాల కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు అవకాశం కల్పించారన్నారు. అయితే చర్చల్లో ప్రతిపాదించిన హామీలపై గురువారం రాత్రి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సవరణ ఉత్తర్వులు జారీ కాలేదన్నారు. ఇన్‌సర్వీస్ కోటా పెంపు కేవలం ఈ ఒక్క ఏడాదికే పరిమితం చేయకుండా కొనసాగించేందుకు వైద్యాధికారులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఏలూరు జిల్లాలోని 62 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న 128 వైద్యాధికారుల్లో 102 మంది సమ్మెలో పాల్గొంటున్నారు. వీరిలో డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ (డీడీవో) అధికారాలున్న 52 మంది వైద్యాధికారులకు డీడీవో అధికారాలను తొలగిస్తూ డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట ఉత్తర్వులు జారీ చేయడంపై సంబంధిత వైద్యుల్లో కొంత ఆగ్రహా వేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆ మేరకు డీడీవో అధికారాలను ప్రత్యామ్నాయంగా 9 పీహెచ్‌సీల వైద్యాధికారులకు అప్పగిస్తున్నట్టు ఖజానా శాఖ అధికారులకు డీఎంహెచ్‌వో తెలియజేసినట్టు తెలిసిందని వైద్యశాఖ వర్గాలు వెల్లడించాయి. సాంకేతికంగా డీఎంహెచ్‌వో చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అమలు సాధ్యం కాదని చెబుతున్నాయి. శాంతియుతంగా డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసనకు దిగిన వైద్యాధికారులు ఇమ్యునైజేషన్ వాహనాల రాకపోకలు, విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంపైనా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారుల దృష్టిలో క్రెడిబిలిటీ కోసమే డీఎంహెచ్‌వో ఇటువంటి చర్యలకు దిగారని వైద్యాధికారులు ఆరోపిస్తున్నారు.

ముగిసిన పొగాకు అమ్మకాలు

రెండు వేలం కేంద్రాల్లో 30 మిలియన్ల విక్రయాలు

వేలం కేంద్రం-2లో ఎన్ఎల్ఎస్ టాప్ ధర రూ.411

7

కౌలు రైతులకు రుణాల మంజూరులో.. రబీ నుంచి ప్రత్యేక విధానం

- రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి


విలేకరుల సమావేశంలో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, సెప్టెంబరు 26 : రాష్ట్రంలో కౌలు రైతులకు పంట రుణాలు అందించడంలో మరింత మేలు జరిగేలా వచ్చే రబీ సీజన్ నుంచి ప్రత్యేక విధానాన్ని తీసు కొస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబం ధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. కలెక్ట రేట్‌లో గురువారం బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్షలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 'వ్యవసాయ రంగంలో 80 శాతానికి పైగా కౌలు రైతులు సాగు చేస్తు న్నారని, అయినప్పటికీ వార్షిక రుణ ప్రణాళికలో ప్రాధా న్యత రంగాలకు రూ.16 వేల కోట్లు రుణ లక్ష్యం కాగా, కౌలు రైతులకు అందులో కేవలం ఒకశాతం రూ.240 కోట్లు లక్ష్యానికి గాను కేవలం రూ.101 కోట్లు పంట రుణాలుగా అందించడం బాధాకరమైన విషయం. గత ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో భూయజ మాని అంగీకారం ఉండాలని పెట్టిన నిబంధనతో కౌలు రైతులకు రుణాలు అందించడంలో బ్యాంకర్లకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 18 లక్షల మందికి పైగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తే , గత ప్రభుత్వం కేవలం 8 లక్షల మంది కౌలు రైతులకు మాత్రమే గుర్తింపు కార్డులు జారీ చేసింది. గత ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్ది భూ యజమాని అంగీకారంతో పని లేకుండా వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో కౌలు రైతులను గుర్తించి భూయాజమాన్య హక్కులకు భంగం కలుగకుండా గుర్తింపు కార్డులు జారీ చేస్తారు. ఆ కార్డును పరిగణలోకి తీసుకుని బ్యాంకర్లు రుణాలు అందిస్తారు. చిన్న, మధ్యతరహా పారిశ్రామిక వేత్తలకు రుణాలు అందించి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి బ్యాంకర్లు సహకరిస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగా లకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.16,500 కోట్ల లక్ష్యానికి గాను మొదటి త్రైమాసికంలో రూ.3,223 కోట్లు రుణాలు గా అందించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సెక్యూరిటీగా నాలా వంటి నిబంధ నలు లేకుండా వ్యవసాయ భూమిని అంగీకరించాలని రాష్ట్ర బ్యాంకర్ల కమిటీని కోరుతున్నాం. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతి వృత్తుల వారికి బ్యాంకులు రుణాలు అందిస్తు న్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులే కాకుండా ప్రైవేటు బ్యాంకులు సామాజిక బాధ్యతతో చిరు వ్యాపారులకు ముద్ర రుణాలు అందించాలి' అన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ సాగర్ డిస్మిస్



ఏలూరు రూరల్, సెప్టెంబరు 26: ఏలూరు డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మాజీ ఎన్జీవో అధ్యక్షుడు ఎల్వీ సాగర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు జారీ చేశారు. సాగర్ కొన్నేళ్ల కిందట ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ డీటీగా పనిచేస్తూ అప్పటి కలెక్టర్ కాటమనేని భాస్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఆయనను సస్పెండ్ చేశారు. అనంతరం కొన్నేళ్ల తరువాత సాగర్ ఐటీడీఏ కోట రామచంద్రపురం డీటీగా, ఏలూరు ఎన్నికల విభాగం డీటీగా పనిచేశారు. ఆయనపై అనేక అవినీతి ఆరోపణలతో పాటు పనిచేసిన కాలంలో రేషన్‌షాపుల వద్ద లంచాలు తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం నిర్ణయిం చింది. సాగర్ ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. తాజాగా ఆయనను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.





జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి పొందిన చిత్రం... కళాశాల విద్యార్థుల విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్న చిత్రం

'గాంధీతత్వం' చిత్రలేఖన పోటీ విజేతలు వీరే

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26 : మహాత్మాగాంధీ 156వ జయంతి పురస్కరించుకుని 'గాంధీతత్వం'పై సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీ విజేతల జాబితాను మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం విడుదల చేశారు. సీనియర్స్ విభాగంలో టెపిని (భీమవరం), ఏ.శ్రీవర్షిణి (మేడపాడు), ఎస్.ప్రజ్ఞ తపస్విరెడ్డి (నిడదవోలు) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. జూనియర్స్ విభాగంలో సీహెచ్.భవిష్ (వేలివెన్ను), టి.భార్గవ్ (ఏలూరు), గాయత్రి (శనివారపుపేట), సబ్ జూనియర్స్ విభాగంలో పి.మోక్షిత (ధర్బగూడెం), ఏ.వి.సాయిస్వాగత్ (నందమూరుగర్వు),కె.గంగహామిని (దండగర్ర) విజేతలుగా నిలిచారు. కళాశాల విద్యార్థుల విభాగంలో శ్యామలగౌరి (భీమవరం), నిహారిక (ఏలూరు), కె.హర్ష (బుట్టాయగూడెం) విజేతలుగా నిలిచారని వివరించారు. విజేతల్లో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవారికి అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద, ఏలూరు జిల్లావారికి 2న ఉదయం 10 గంటలకు పెదనిండ్రకొలను మహాత్మాగాంధీ భవనం వద్ద, తూర్పు గోదావరి జిల్లావారికి మధ్యాహ్నం 2 గంటలకు మల్లవరం గాంధీ ఆశ్రమం వద్ద నిర్వహించే కార్యక్రమాల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

చిన్నారి చేతనకు కలెక్టర్ అభినందన



భీమవరంటౌన్, సెప్టెంబరు 26 : భీమవరానికి చెందిన చిన్నారి బొలిశెట్టి చేతన గత ఏప్రిల్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో రికార్డు సాధించిన బొలిశెట్టి చేతనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. మే నెలలో మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంది. ఇప్పుడు వరల్డ్ రికార్డు సాధించింది. 8 సంవత్సరాల 2 నెలల వయసులోనే ద్వారకాతిరుమల, అప్పనపల్లి, సింహాచలం, అంతర్వేది, అన్నవరం, వాడపల్లి వంటి ప్రముఖ ఆలయాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 108 ప్రదేశాల్లో 108 సార్లు భగవద్గీత శ్లోకాలు తెలుగు అర్థాలతో పాటు పారాయణ చేసి అంతర్జాతీయ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సాధించినందుకు చేతనను కలెక్టర్ అభినందించారు..



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

స్కూల్ గేమ్స్‌లో రేలంగి విద్యార్థుల ప్రతిభ

ఇరగవరం, సెప్టెంబరు 26 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనపరచాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్కూల్‌గేమ్స్‌లో కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో రేలంగి ఉన్నత పాఠశాల విద్యార్థులు 19 మంది ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న రైతు సంఘ నాయకులు

ద్వారకాతిరుమలలో నేడు రాష్ట్ర రైతు సదస్సు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26: ద్వారకాతిరుమలలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరుగునున్న రాష్ట్ర రైతు సదస్సు విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్‌లు కోరారు. గురువారం సదస్సు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమల యాదవ కల్యాణమండప ఆవరణలో సదస్సు జరుగుతుందని వివరించారు. సదస్సు అనంతరం మూడురోజుల పాటు జరిగే రాష్ట్ర కార్యకర్తల శిక్షణా తరగతుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 150 మంది పాల్గొంటారని వివరించారు.సదస్సుకు మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, నేతలు శ్రీనివాసరావు, వి.కృష్ణయ్య, పలు రైతు సంఘనేతలు పాల్గొంటారన్నారు.

కొవ్వలి బీసీ వసతి గృహంలో సదుపాయాలు కల్పించాలంటూ ఆందోళన



విద్యార్థి సంఘం నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ స్వామి

దెందులూరు, 26 సెప్టెంబరు : కొవ్వలి బీసీ బాలుర వసతి గృహంలో విద్యా ర్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ వివాదం పెరగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. దెందులూరు మండలం కొవ్వలి బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థి సంఘం నాయకులు విద్యార్థులతో కలిసి గురువారం నిరసన చేపట్టారు. విద్యార్థులను పాఠశాలకు వెళ్లానివకుండా అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఇబ్బందులు తలెత్తాయని మీడియా ముందు చెప్పడంతో కొవ్వలి టీడీపీ నాయకుడు రామకృష్ణ, కొంతమంది వసతి గృహనికి చేరుకున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో నిధులు కేటాయించలేదని గత టీడీపీ ప్రభుత్వంలో 300 పిల్లలు ఉండేవారిని ఇప్పుడు 50 మంది మాత్రమే ఉన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు కాకుండానే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దీంతో వివాదం రాజకీయ రంగు పులుముకోవడంతో దెందులూరు ఎస్ఐ స్వామి తమ సిబ్బందితో వచ్చి విద్యార్థి సంఘం నాయకులు, టీడీపీ నాయకులను అక్కడ నుంచి పంపించి వేశారు. దీనిపై కొవ్వలి వసతిగృహం అధికారి సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ కొంత మంది విద్యార్థి సంఘం నాయకులు డబ్బులు డిమాండ్ చేశారని ఇవ్వనందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

రూ.10 నాణేనికి ఏమైంది !

తిరస్కరిస్తున్న వ్యాపారులు..జనం

రూ. 10 నోట్లకు కొరత వచ్చింది..

ఇప్పుడు..నాణేలే దిక్కు

తీసుకోకపోతే ఫిర్యాదు చేయండి





ఏలూరు రూరల్, సెప్టెంబరు 26: పది రూపాయల నాణేన్ని జనం బాన్ చేశారు. వాటిని తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. అసలు రూ.10 నాణెం ఎందుకు వద్దంటున్నారని అడిగితే సమాధానం మాత్రం దొరకడం లేదు..నాణేల వినియోగంపై ఆర్బీఐ ఎటువంటి ప్రకటన చేయకపోయి కొన్నాళ్లుగా వ్యాపారులు వీటిని తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో, పెట్రోల్ బంకుల్లో , దుకాణాల్లో సైతం తీసుకోవడం మానేశారు. రూ.10 నోట్లస్థానంలో ఐదేళ్లక్రితం రూ.10 నాణేలను ఆర్బీఐ అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం రూ.10 నోట్ల కొరత వచ్చింది. ఇందుకు ప్రత్యామ్నాయమైన రూ.10 నాణెం చెలామణి అవుతుందని చెబుతున్నా కొంతమంది వ్యాపారులు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. 2019లో ఆర్బీఐ ప్రవేశపెట్టిన రూ.10 నాణేన్ని స్టాండర్డ్ డిజైన్‌తో నాలుగు రకాలుగా విడుదల చేశారు. రూ.10 నోటు ఎక్కువకాలం మన్నికగా ఉండదు. దీంతో 20 ఏళ్లపాటు చెలామణిలో ఉండేలా ఆర్బీఐ నాణాన్ని అందుబాటులోకి తెచ్చింది. రూపాయి, రెండు, ఐదు రూపాయల నాణేల తరువాత రూ.10 నాణెం విలువైనది. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులు, వ్యాపార సముదాయాల్లోనూ విరివిగా వీటినే వినియో గిస్తున్నారు. ఇక్కడ ఈ నాణేని ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

తీసుకోకపోతే కేసు నమోదు

రూ.10 నాణెం చెలామణిలో ఉందని అన్నిచోట్ల చెల్లుబాటు అవుతుందని ఇటీవల ఆర్బీఐ స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణాన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. రూ.10 నాణెం చెలామణిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఏలూరులోని కొన్ని పెట్రోల్ బంకుల్లో కొందరు వాహనదారులు రూ.10 నాణేలు ఇవ్వగా సిబ్బంది తిరస్క రించారు. చిన్న వ్యాపారులు అవగాహన లేక నాణేలు తిరస్కరిస్తున్నారంటే వారిలో ఉన్న భయా లకు అర్థం ఉంది... కానీ కేంద్ర పెట్రోలియం సంస్థల ద్వారా నడిచే పెట్రోల్ బంకుల్లో సైతం తిరస్క రించడం విడ్డూరంగా ఉందని తగిన చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు కోరుతున్నారు.



వేలం కేంద్రం-2 లో కార్యాలయ సిబ్బందిని సత్కరించిన రైతులు

ముగిసిన పొగాకు అమ్మకాలు

రెండు వేలం కేంద్రాల్లో 30 మిలియన్ల విక్రయాలు

వేలం కేంద్రం-2లో ఎన్ఎల్ఎస్ టాప్ ధర రూ.411

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 26: జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం-2లో కిలో పొగాకు ధర రూ.411 పలికి ఎన్ఎల్ఎస్ రీజియన్‌లో పొగాకు ధరల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు వేలం నిర్వహణాధికారి జె.సురేంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఒకటవ వేలం కేంద్రం, గురువారంతో రెండో వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ళు ముగిశాయి. మార్చి 6 న వేలం ప్రారంభమై 160 రోజుల పనిదినాల్లో వేలం కేంద్రం-1లో పదిహేను మిలియన్ల కిలోల పొగాకు అమ్మకాలు జరిగినట్లు వేలం కేంద్రం-1 వేలం నిర్వహణాధికారి శ్రీహరి తెలిపారు. తమ ప్లాట్‌ఫారంలో కిలో పొగాకుకు అధికంగా రూ.410 ధర పలికిందన్నారు. వేలం కేంద్రం-2 వేలం నిర్వహణాధికారి నరేంద్రకుమార్ మాట్లాడుతూ తమ వేలం కేంద్రం పరిధిలో 2023-24 సంవత్సర పంట కాలానికి 2803 మంది రైతులుండగా 3082 బ్యారన్లను రిజిస్టర్ చేసుకున్నారన్నారు. ఈ సంవత్సరం 15.15 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు జరిగాయని తెలిపారు. కిలో పొగాకు ధర అత్యధిక ధర రూ.411, అత్యల్ప ధర రూ.100గా నమోదైనట్లు తెలిపారు. 52 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నట్లు తెలిపారు. పొగాకు చూర (స్క్రాప్) అమ్మకాలను మరికొద్ది రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యాలయ సిబ్బందిని రైతులు ఘనంగా సత్కరించారు. రైతు సంఘ నాయకులు సత్రం వెంకట్రావు, చంటిబాబు, అట్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



టిప్పర్ యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఇసుక రవాణా వాహనాల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

టిప్పర్ వాహన యజమానులతో కలెక్టర్ సమావేశం

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 : ఇసుక రవాణాకు సంబంధించిన వాహనాల రిజిస్ట్రేషన్‌కు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి టిప్పర్ల యజమానుల సంఘాలకు తెలిపారు. కలెక్టరేట్‌లో టిప్పర్ల యజమానులతో సమావేశమై ఇసుక రవా ణాకు వాహనాల రిజిస్ట్రేషన్లపై సమీక్షించారు.ఉచిత ఇసుక విధానంలో భాగంగా ఇంటికి ఇసుక డోర్ డెలివరీ చేసే టిప్పర్ల యజమానులు డిపాజిట్ చెల్లించడం, అఫిడవిట్ రూపంలో ఒప్పందం చేసుకోవడం వంటివి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందన్నారు. నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలని, టిప్పర్లకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వినియోగదారులకు ఇబ్బంది లేనివిధంగా ఇసుక రవాణా వెంటనే చేపట్టాలని టిప్పర్ల యజమానులను కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు,ఆర్డీవో పి.ఉమా మహేశ్వర రావు, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి జయప్రసాద్, టిప్పర్ల యజమానుల సంఘాలకు చెందిన రావూరి రాజా, బండారు సత్తిబాబు, కౌరు నాగరాజు, కోలా సత్యనారాయణ, బండారు శ్రీనివాస్, యాతం గణపతి, ముచ్చర్ల వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు ఏక మొత్తంలో చెల్లించాలి

రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 : గత పీఆర్సీ , డీఏ బకాయిలు, అన్ని రకాల పెండింగ్ బకాయిలను రిటైరైన వారికి ఏకమొత్తంగా ఒకేసారి చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జేమ్స్ ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం భీమవరం రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించారు. కొత్త పీఆర్సీ కమిటీని నియమించి ఇంటెరిం రిలీఫ్ (ఐఆర్) ప్రకటించాలని, అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పాత రేట్లలో అమలు చేయాలని, కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్ మినహాయింపు 11 సంవత్సరాలకే పరిమితం చేయాలన్నారు. ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేదీలేని వారికి నమోదు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగిరాజు నారాయణరాజు, కోశాధికారి రవిప్రసాద్ ప్రవేశపెట్టిన నివేదికలను కార్యవర్గం ఆమోదించింది. సమావేశంలో స్టేట్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ బాబ్జి పెన్షనర్స్‌కు అన్ని రకాల సేవలను తమ బ్యాంకులో సేవా భావంతో చేస్తామన్నారు.బ్యాంకు మేనేజర్ బాబ్జిని, ఉండి మండలం రిటైర్డ్



రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రంగరాజును సత్కరించిన దృశ్యం

ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ గాదిరాజు రంగరాజుని సమావేశంలో సన్మానించారు. సమావేశంలో సహాధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌రాజు, జోబ్బాబు, ఎన్ ఎస్.ఎస్ పాల్, సూర్యనారాయణ, కె.చంద్రరావు, వీఎస్ అప్పారావు, యూజీసీ లెక్చరర్స్ సాగి అప్పలరాజు పాండురంగ రాజు తదితరులు పాల్గొన్నారు. భీమవరం, ఆకివీడు, గణపవరం, పాలకొల్లు మండల యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.



దువ్వ మూల లంక వంతెన వద్ద గుమిగూడిన జనం

వయ్యేరులోకి దూకిన బాలిక ?

గాలింపు చర్యలు చేపట్టిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది

తణుకు, సెప్టెంబరు 26 : వయ్యేరు కాలువలోకి బాలిక దూకినట్లు అనుమానంతో వంతెన వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకున్నారు. శుక్రవారం కోనాల గ్రామానికి చెందిన బాలిక ముద్దాపురంలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. రోజు మాదిరిగానే ఉదయం స్కూలుకు ఇంటి నుంచి వెళ్లింది. స్కూలుకు వెళ్ళిన బాలిక తిరిగి వచ్చి దువ్వ మూల లంక వంతెన నుంచి వయ్యేరు కాలువలోకి దూకినట్లు అనుమానిస్తున్నారు. అయితే వంతెన వద్ద బాలిక విడిచిన చెప్పులు, వాటర్ పైపుపై బాలిక పాద ముద్రలు ఉండటంతో వయ్యేరులో దూకినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మూర్తి తెలిపారు. బాలిక కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వయ్యేరులో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఎలాంటి ఆచూకీ తెలియ రాలేదు. కోనాల, ముద్దాపురం, దువ్వ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున కాలువ వద్దకు తరలి వచ్చారు.

యనమదుర్రు డ్రెయిన్‌లో వ్యక్తి గల్లంతు

భీమవరం క్రైం, సెప్టెంబరు 26 : భీమవరం పట్టణంలోని గొల్లవానితిప్ప రోడ్‌లో ఉన్న యనమదుర్రు డ్రెయిన్‌పై ఉన్న వంతెన నుంచి దూకి ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. టూటౌన్ ఎస్ఐ రహమాన్ తెలిపిన ప్రకారం ఎన్టీఆర్ జిల్లా ప్రాంతానికి చెందిన పోతిసీడి నాగరాజు కొంతకాలం క్రితం కుటుం

క్రైమ్ కార్నర్

బంతో సహా భీమవరం సగర్లపేటలో నివాసం ఉంటున్నాడు. అయితే ఈనెల 25వ తేదీ సాయంత్రం 4 గంటలకు బయటకు వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లాడు. సాయంత్రం 6 గంటల సమయంలో భార్యకు ఫోన్ చేసి డ్రెయిన్‌లో దూకి చనిపోతున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. భార్య, బంధువులు వెతకగా గొల్లవానితిప్ప రోడ్‌లో ఉన్న వంతెనపై ద్విచక్ర వాహనం, చెప్పులు, ఫోన్ కనిపించడంతో భార్య పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. డ్రెయిన్‌లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 26 : గోదావరిలో గల్లంతైన వ్యక్తి భీమవరానికి చెందిన నాయుడు సుబ్రహ్మణ్యం(33)గా కొవ్వూరు రూరల్ పోలీసులు గుర్తించారు. ఈనెల 24వ తేదీన కొవ్వూరు, రాజమహేంద్రవరం మధ్య గోదావరిపై ఉన్న రోడ్డు కం రైలు బ్రిడ్జిపై బైక్‌ను పార్క్‌చేసి ఒక వ్యక్తి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. మృతదేహం బుధవారం అర్ధరాత్రి కొవ్వూరు మండలం మద్దూరులంక బ్యారేజ్ గేట్ల వద్ద గుర్తించారు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుబ్రహ్మణ్యం ఈనెల 24వ తేదీన ఏడిద గ్రామంలో ఉన్న తల్లిదండ్రులను చూడడానికి వెళ్లి తిరిగి భీమవరం బయలుదేరాడు. బ్రిడ్జిపైకి వచ్చే సరికి ఫిట్స్ రావడంతో గోదావరిలో పడిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

చింతలపూడి, సెప్టెంబరు 26 :చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలోని చెరువులోకి దిగి గ్రామానికి చెందిన ఏలూరు నాగరాజు (26) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. గురువారం స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికితీశారు. ఎస్ఐ కుటుంబరావు మాట్లాడుతూ మృతుడు తాపీ పనులు చేస్తుంటాడని, రెండు రోజుల క్రితం బయటకు వెళ్లాడని తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు రెండు రోజుల నుంచి గాలిస్తున్నా కనపడలేదు. గురువారం చెరువులో శవమై కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిద్రమత్తులో కారు బీభత్సం..యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26: డ్రైవర్ నిద్రమత్తుతో కారు పాదచారులపై దూసుకెళ్లడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన తాడేపల్లిగూడెంలో బుధవారం అర్ధరాత్రి కలకలం రేపింది. నిడమర్రు మండలం భువనపల్లికి చెందిన వినయ్‌బాబు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వినయ్‌బాబు తన స్నేహితుడిని కారులో రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో దింపి తిరిగి ఇంటికి వస్తూ నిద్రమత్తులో తాడేపల్లిగూడెంలో రేలంగి చిత్ర మందిర్‌వైపు నడిచి వెళ్తున్న ముగ్గురు యువకులను ఢీకొట్టాడు.. దీంతో పట్టణానికి చెందిన కరణం దుర్గారావు (30) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు యడ్ల నాగేశ్వరరావు,మజ్జి దుర్గాప్రసాద్‌లకు తీవ్ర గాయాలవడంతో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యడ్ల నాగేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వినయ్‌బాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.





విధ్వంసం సృష్టించిన కారు

ప్రమాదంలో మృతి చెందిన దుర్గారావు (ఫైల్‌ఫోటో)



శిరస్సుపై అఖండ దీపంతో పాదయాత్రగా ద్వారకాతిరుమలకు వస్తున్న అవినాష్ దేవిచంద్ర తదితరులు

అపరాధం మన్నించు స్వామీ..

లడ్డూ కల్తీపై అఖండ దీపంతో మహా పాదయాత్ర

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26: తిరుపతి కల్తీ ప్రసాదం దోషులను శిక్షించాలని కోరుతూ పిఠాపురం నుంచి పెద్ద తిరుపతి వరకూ తారా వారాహి లోక కల్యాణార్థ సేవా భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా పాదయాత్ర గురువారం మధ్యాహ్నం ద్వారకాతిరుమల చేరుకుంది. అఖండ దీపాన్ని తలపై ఉంచుకుని ట్రస్టుచైర్మన్ అవినాష్ దేవిచంద్ర పాదయాత్ర చేసుకుంటూ క్షేత్రానికి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దేవిచంద్ర మాట్లాడుతూ ఇటీవల తిరుమల ప్రసాదం కల్తీ విషయంలో మహాపాపం జరిగిందని ఆ పాపం పోవాలంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ ఒక్కరూ అఖండ దీపం వెలిగించాలని కోరారు.

మోకాళ్లతో శ్రీవారి ఆలయ మెట్లు ఎక్కిన జన సైనికులు



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన నాయ కులు, వీర మహిళలు ద్వారకా తిరుమల ఆలయ దక్షిణగోపురం ముందున్న మెట్లను మోకాళ్లపై ఎక్కారు. పాదుకా మండపం వద్ద 108 కొబ్బరి కాయలను కొట్టారు. తిరుపతి లడ్డూ కల్తీ ఘటనపై ఏలూరు జనసేన పార్టీ, నగర కమిటీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం తలపెట్టినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, నగర అధ్యక్షుడు కాశీ నరేష్, బీజేపీ, టీడీపీ నాయకులు కుసుమ కుమారి, ఇమ్మడి రత్నాజీ, కావూరి వాణిశ్రీ, రవి, గాయత్రి, పద్మ, కోట అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.





అలంకరణలో స్వామివారు.. హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ళకూరు వెంకన్న ఆలయంలో పవిత్రోత్సవాలు

కాళ్ళ, సెప్టెంబరు 26 : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్త నదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం స్వామివారికి యాగశాలార్చన, అగ్ని ప్రతిష్ఠ, కుంభ వాహన, పవిత్ర ప్రతిష్ఠ , పవిత్రాధివాసం, ప్రాయశ్చిత హోమాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు పవిత్ర సమర్పణ తీర్థగోష్ఠి, ప్రసాద వితరణ ఘనంగా జరిపారు. ఈవో అరుణ్‌కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు. కొండూరి వెంకట రమణాచార్యులు బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కరాటం రాంబాబు

పోలవరం బాధితుల సమస్యలు పరిష్కరించండి

కొయ్యలగూడెం, సెప్టెంబరు 26: పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సమస్య పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరినట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబుతో కలిసి ఆయన గురువారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిశారు. పోలవరం నియోజకవర్గ సమస్యలను ఆయనకు వివరించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో రైతులు, నిర్వాసితులకు ఇచ్చిన భూములకు ఇంకా పరిహారం అందలేదన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. గ్రామీణ రోడ్లు, పర్యాటక రంగం అభివృద్ధి చేయాలని కోరామన్నారు. జనసేన నాయకులు కరాటం సాయిబాబు, గడ్డమనుగు రవికుమార్ ఉన్నారు.

ఓఎల్ఎక్స్‌లో కారు బేరం..

అమ్మేసిన కారునే విక్రయించి రూ.3 లక్షలకు టోకరా

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26: తాడేపల్లిగూడెంలో ఓఎల్ఎక్స్‌లో కారు బేరం పెట్టి మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఓ అమ్మేసిన కారును అమ్మకానికి పెట్టి మరొకరికి విక్రయించి రూ.3 లక్షలు మోగించాడో ప్రబుద్ధుడు. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడేనికి చెందిన వ్యక్తి ఓఎల్ఎక్స్‌లో ఓ కారును అమ్మకానికి పెట్టాడు. మండపేటకు చెందినవారు తాడేపల్లిగూడెం వచ్చి కారు చూసుకున్నారు. రెండు రోజుల్లో వస్తామని చెప్పి కొనుగోలు చేసేందుకు డబ్బుతో వచ్చారు. కారు స్నేహితుడు తీసుకెళ్లాడని గంటలో వస్తుందని చెప్పి కారు బేరం పెట్టాడు. రూ.4 లక్షలకు మాట్లాడుకున్న మండపేట వాసి దానికి సంబంధించి అడ్వాన్స్ ఇద్దామని అనుకున్నాడు. కారు వచ్చేస్తుంది.. డబ్బులు ఇచ్చేయండని పట్టుబట్టడంతో రూ.3 లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించారు. మిగిలిన లక్ష రూపాయలు కారు కాగితాల బదిలీ సమయంలో ఇస్తామని చెప్పారు. ఎంత సేపటికీ కారు రాలేదు. కారు విజయవాడ తీసుకెళ్లారని రేపు ఉదయమే వచ్చి తీసుకెళ్లండని నమ్మించి పంపించాడు. మరుసటి రోజు కూడా అలాగే కారు రావకపోవడంపై స్టోరీ చెప్పుండటంతో అనుమానం వచ్చిన మండపేట వాసి కారు ఎవరి పేరున ఉందో చెక్ చేయగా నర్సీపట్నం పేరు మీద తాను కొనుగోలు చేద్దామనుకున్న రోజుకంటే ముందే విక్రయించినట్టు తెలిసి మోసపోయినట్టు గుర్తించాడు. వెంటనే తాడేపల్లిగూడెం పోలీసులను ఆశ్రయించగా అక్కడ ఇరువురినీ పిలిపించి డబ్బులు ఇచ్చేందుకు అంగీకార పత్రం రాయించి పంపించేశారు. డబ్బులు ఇస్తానన్న గడువు దాటినా ఇవ్వకపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి..13 మంది అరెస్టు

పెనుగొండ, సెప్టెంబరు 26 : పేకాట స్థావరంపై దాడి చేసిన 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. బుధవారం రాత్రి రెండు గంటల సమయంలో పెనుగొండలోని ఒక లాడ్జిలో పేకాట ఆడుతున్న వ్యక్తులపై దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 40, 300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటారు సైకిల్ చోరీపై కేసు నమోదు

అత్తిలి, సెప్టెంబరు 26 : మోటారు సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్పి ప్రేమ్‌రాజ్ తెఎలిపారు. కంచుమర్రు గ్రామంలోని రొయ్యల చెరువు మీద ఈడూరు గ్రామానికి చెందిన నంద్యాల రాంబాబు పని చేస్తున్నాడు. ఈనెల 17వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో చెరువు పక్కన మోటారు సైకిల్‌ను పెట్టి చెరువు మీద కాపలాకు వెళ్ళి తిరిగి తెల్లవారు జామున 3 గంటలకు వచ్చే చూసేసరికి మోటారు సైకిల్ కనిపించలేదు. బాధితుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గీతారాజ్ కర్కరేకు పురస్కారం అందజేస్తున్న మండలి బుద్ధప్రసాద్

భారతీయ నృత్య కళలను ఆదరించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 26: భారతీయ నృత్య కళలను ఆదరించాలని, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కేవీ.సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా వైఎంహెచ్ఏ, కేవీఎస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నృత్య కళాకారులకు కేవీఎస్ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. యూఎస్ఏకు చెందిన గురు గీతారాజ్ కర్కరేకు మండలి బుద్ధప్రసాద్ అవార్డు అందజేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కేవీ.సత్యనారాయణ నాట్య కళకు ఎంతగానో గుర్తింపు తెస్తున్నారని, నాట్యరంగానికి ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఏవీ.శేషసాయి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, వైఎంహెచ్ఏ ఉపాధ్యక్షుడు కె.కె గుప్తా, ఇరదల ముద్దు కృష్ణ, వేణుగోపాల్ లునాని, వేమా కోటేశ్వరరావు, మజ్జి కాంతారావు, ఎల్.వెంకటేశ్వర రావు, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు, కె.కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వంపై అవగాహన



మాట్లాడుతున్న డీసీపీవో సూర్యచక్రవేణి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 26: ప్రపంచంలో ఏ రంగంలో చూసినా పురుషాధిక్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని జిల్లా బాలల సంరక్షణాధికారి సీహెచ్.సూర్యచక్రవేణి అన్నారు. దళిత, బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో లేడిస్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ సింగవరపు జ్యోతి అధ్యక్షతన స్త్రీ పురుష సమానత్వంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. వన్‌స్టాప్ సెంటర్ సీఏ సీహెచ్ నిర్మల మాట్లాడుతూ శారీరక, మానసిక అరాచకానికి గురైన వారు, గృహ హింస, వరకట్నం, బాల్యవివాహాలు తదితర సమస్యలను వన్‌స్టాప్ సెంటర్ దృష్టికి తీసుకురావాలన్నారు. అవసరమైతే 181 కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేసి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎం.హేమలత, జే.రమాదేవి, అమలా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 26: జిల్లాలో గృహనిర్మాణ శాఖలో వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లు పొరుగు సేవల విధానం తప్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రి కొలుసు పార్థసారథిని కోరారు. రెవెన్యూ అతిథిగృహంలో గురువారం మంత్రిని కలిసి సీనియార్టీ ప్రకారం ఎన్ఎంఆర్, హెచ్ఆర్ ఉద్యోగులుగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్నామని, తమతో పాటు నియామకం జరిగిన డీఆర్‌డీఏ, డ్వామా, ఎన్ఆర్ఈజీఎస్ శాఖల వారికి హెచ్ఆర్ పాలసీని అమలు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. సిబ్బంది కె.నాగభూషణం, పావని, చంద్రశేఖర్, కె.పోసుకుమార్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సివిల్ సప్లయిస్ డీఎం శ్రీలక్ష్మి

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా నియమితులైన వి.శ్రీలక్ష్మి గురువారం మంత్రి కొలుసు పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఖరీఫ్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని సేకరించాలని మంత్రి ఆమెకు సూచించారు. సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు.

మన ఇల్లు - మన గౌరవం విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

లింగపాలెం, సెప్టెంబరు 26: మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోషల్ వెల్ఫేర్ జేడి వి.జయప్రకాష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 28 నుంచి జరిగే కార్యక్రమంలో అధికారులు కాలనీల్లో పర్యటించి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం ప్రారంభించి బిల్లులు రాక అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను డిసెంబర్ నెలాఖరులోపు పూర్తిచేస్తే బిల్లులు వస్తాయన్నారు. ఎంపీడీవో కె.వాణి, ఈవోపీఆర్డీ జేఎం రత్నకుమార్, హౌసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆశా వర్కర్ల ఆందోళన



నినాదాలు చేస్తున్న ఆశా వర్కర్లు

టి.నరసాపురం, సెప్టెంబరు 26: ఆశా వర్కర్ కాసగాని లక్ష్మీమంగను విధుల నుంచి తొలగించడంపై ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గురువారం ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. కార్యకర్తలపై రాజకీయ వేధింపులు నివారించాలని ఆశా వర్కర్ లక్ష్మీమంగను వేధింపులకు గురిచేసిన ఎంఎల్‌హెచ్‌పీపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలని ఆమెకు న్యాయం జరిగేవరకు పోరాడుతామని నినాదాలు చేశారు. వై.విజయలక్ష్మి, ఈ.లక్ష్మి, ఎస్.జ్యోతి ఉన్నారు.

జనవాణిలో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బాలరాజు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 26: జనసేన కార్యాలయంలో గురువారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫోన్‌లో మాట్లాడారు. శుక్రవారం మూడో రోజు జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. బుట్టాయగూడెం జీలుగుమిల్లి మండలాల జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శులు కరాటం సాయి, గడ్డమణుగు రవికుమార్ ఉన్నారు.

రైతులు సహకార సంఘ సేవలను వినియోగించుకోవాలి



మహాజనసభలో మాట్లాడుతున్న సీఈవో

టి.నరసాపురం, సెప్టెంబరు 26: సహకార సంఘ సేవలను రైతులు వినియోగించుకోవాలని మధ్యాహ్నపువారిగూడెం సంఘ చైర్‌పర్సన్ ఎర్రా ఏసుకుమార్ తెలిపారు. సీఈవో జి.భుజంగరావు అధ్యక్షతన గురువారం మహాజన సభ నిర్వహించారు. రైతులకు అవసరమైన ఎరువులు, పంట రుణాలు, బంగారంపై తక్కువ వడ్డీకి అప్పులు ఇస్తున్నామన్నారు. పర్సన్ ఇన్‌చార్జి ఏసుకుమార్, మాజీ అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. మక్కినవారిగూడెం సహకార సంఘ ఆవరణలో చైర్‌పర్సన్ యర్రా ఏసుకుమార్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సీఈవో యూవీ.సత్యనారాయణ, సంఘ లావాదేవీలు పలు అంశాలను వివరించారు. నూతనంగా చేపట్టబోయే అంశాలను మహాజన సభలో సభ్యులు ఆమోదించినట్లు సీఈవో తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

భీమడోలు, సెప్టెంబరు 26: పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ సూచించారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని ఆగడాలలంకలో గురువారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అధిక వర్షాలతో నీటి నిల్వలు ఏర్పడి డెంగీ, మలేరియా దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. తొట్లలో నీళ్ళు ఉంచవద్దని, నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచకూడదన్నారు. నీటి నిల్వ ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది దోమల నివారణ ద్రావణాన్ని పిచికారీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.






జంగారెడ్డిగూడెంలో క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే రోషన్ పరుగు, కైకరంలో క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, శనివారపుపేట పాఠశాలలో క్రీడా పోటీలు, రాష్ట్రస్థాయికి ఎంపికైన రంగాపురం విద్యార్థులు

విద్యార్థులకు క్రీడలతో మంచి భవిష్యత్

పలు చోట్ల క్రీడా పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యేలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 26: విద్యార్థులకు క్రీడలతో మానసికోల్లాసంతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఆయన కొద్దిసేపు పరిగెత్తి బాల బాలికలలో ఉత్తేజం కలిగించారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. ఆటల పోటీలలో పాల్గొనే విద్యార్థులు తప్పని సరిగా షూస్ వేసుకుని ఆడాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రారంభించారు. మెప్మా మహిళలు అమ్మకానికి ఉంచిన చేసిన వివిధ రకాల తినుబండారాలు, ఇతర దుకాణాలను ఎమ్మెల్యే పరిశీలించి పలు వస్తువులను కొనుగోలు చేశారు. అంగన్‌వాడీ, వైద్యశాఖ స్టాల్స్‌ను పరిశీలించారు. జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, తహసీల్దారు కె.స్లీవజోజి, కమిషనర్ జె.నరేంద్రకుమార్, ఎంఈవోలు బి.రాములు, పి.రాములు, హెచ్ఎం ఎం.విజయ ప్రకాష్, మున్సిపల్ కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి, రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, కొప్పాక శ్రీనివాసరావు, షేక్ ముస్తఫా, అబ్బిన దత్తాత్రేయ, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిశోర్, సాయిల సత్యనారాయణ, చిట్రోజు తాతాజీ, రాజాన పండు, మద్దిపాటి నాగేశ్వరరావు, జి.ఉమా మహేశ్వరి, మారిశెట్టి బాలచిట్టెమ్మ, ఉక్కుర్తి సీతారాం, ఇనగడప వీర రామాంజనేయులు, మహంకాళి రామ్మోహన రావు, బూరుగుపల్లి సూరిబాబు, చేను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించి నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 స్కూల్ గేమ్స్‌లో పోటీలు నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, క్రీడాకారుల నుంచి ఎమ్మెల్యే ధర్మరాజు గౌరవ వందనం స్వీకరించారు. హైస్కూలు మైదానం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. సర్పంచ్ సలగాల గోపి, విద్యా కమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి, జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వివిధ మండలాల పీడీలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: శనివారపుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో రెండో రోజు బాలికలకు పలు పోటీలు నిర్వహించారు. పోటీలను హెచ్ఎం ప్రకాశ్ ప్రారంభించారు. చదువులో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు. ఖోఖో, హ్యాండ్‌బాల్, షటిల్, చెస్, పరుగుపందెం తదితర పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, పీడీ, పీఈటీలు, కోఆర్డినేటర్ పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: రాష్ట్రస్థాయి అండర్-18 విభాగంలో రన్నింగ్, లాంగ్‌జంప్ పోటీలకు రంగాపురం పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న జరిగిన క్రీడాపోటీల్లో ఎం.రూపేష్ 100మీటర్ల పరుగుపందెంలో ప్రథమస్థానం సాధించాడు. 12 మీటర్ల లాంగ్‌జంప్‌లో ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యాడు. అండర్ -14 బాలుర విభాగంలో వి.వరుణ్, హర్షవర్ధన్ ద్వితీయ స్థానం సాధించారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం వెంకటరత్నం, పీడీ ఎం.లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

● టి.నరసాపురం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఆటల పోటీలకు 14 మంది విద్యార్థులు ఎంపికైనట్లు అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డీఎస్‌బి శంకర్‌రావు గురువారం తెలిపారు. రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావలిన్ త్రోలో గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఐదుగురు బంగారు పతకాలు, ఆరుగురు రజత, ఐదుగురు కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. వీరందరూ కూడా జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వారిని పీఈటీ లాహిరి దుర్గ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు కేతవరం హైస్కూల్ విద్యార్థిని కొలుకులూరి హేమశ్రీ ఎంపికైనట్లు హెచ్ఎం ఎంవీ అప్పారావు తెలిపారు. ఈనెల 25న పెదవేగి గురుకుల పాఠశాలలో నిర్వహించిన బేస్‌బాల్ బాలికల అండర్-14 విభాగంలో హేమశ్రీ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. వ్యాయామోపాధ్యాయుడు జి.రమేష్‌ను ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్ గంటా బుజ్జిబాబు, తల్లిదండ్రులు అభినందించారు.





ఇది మంచి ప్రభుత్వం కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి, చింతలపూడి మండలంలో నేతల ప్రచారం, ముందూరులో మాట్లాడుతున్న చింతమనేని

ప్రజలందరికి సంక్షేమ ఫలాలు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 26: అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందించే దిశగా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. రెండో డివిజన్‌లో గురువారం ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే చంటి ఇంటింటికి వెళ్లి వంద రోజుల కూటమి ప్రభుత్వ మంచి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ప్రజలవద్దకే పాలనను తీసుకెళ్లాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. డిసెంబర్ ఆఖరులోపు ప్రజలకు హామీ ఇచ్చిన మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, నగర టీడీపీ అధ్యక్షులు శివప్రసాద్, కొల్లేపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: పేదల సంక్షేమం లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభాకర్ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా నడిపించడంలో చంద్రబాబు తీసుకుంటున్న చర్యలు ప్రజామోదం పొందుతున్నాయన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఘంటసాల వెంకటలక్ష్మి, కొఠారు ఆదిశేషు, టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాదు రవికుమార్, కొనకళ్ళ శివమణి, బలుసు శ్రీనివాస్ చౌదరి, లావేటి శ్రీనివాస్, మాగంటి నారాయణప్రసాద్, షేక్ ఉద్దండు పాల్గొన్నారు.

● నిడమర్రు: కూటమి ప్రభుత్వం 100 రోజులలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. నిడమర్రులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులతో కలసి ఎమ్మెల్యే ధర్మరాజు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల స్వామి, సత్తినీడి నాని, జనసేన మండల కన్వీనర్ నిమ్మల దొరబాబు, జవ్వాది బాలాజి, చలమలశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

● చింతలపూడి: ప్రగడవరం పంచాయతీ ముక్కంపాడు, వెలగలపల్లి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం టీడీపీ నేతలు నిర్వహించారు. కనమతరెడ్డి రాజారెడ్డి, సి.హెచ్.శ్రీనివాసరెడ్డి, బుద్దాల నాగు, మానేపల్లి రాజారావు, చక్రపు మారేశు పాల్గొనగా, వెలగలపల్లిలో టి.శ్రీనివాసరెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై వివరించారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బాలాజీ నగర్‌లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తుందన్నారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వం వచ్చి వంద రోజుల్లో అభివృద్ధి అంటే ఏంటో చూపించామని అన్నారు.

కూరగాయల ధరలు, అమ్మకాలపై నిఘా

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 26: కూరగాయల ధరలు, అమ్మకాలపై అధికారులు నిఘా ఉంచారు. అధిక ధరల నియంత్రణపై రైతుబజార్లు, బహిరంగ మార్కెట్ వ్యాపారులకు ఆదేశాలు ఇచ్చారు. రైతుబజార్లలో కిలో టమోటా రూ. 44, వంకాయలు రూ.48, బెండ రూ.26, మిర్చి రూ.25, కాకర రూ.28, బీర రూ.40, క్యాబేజి రూ.30, క్యారెట్ రూ.44, దొండ రూ.40, బంగాళదుంప రూ.40, ఉల్లి రూ.58, గోరుచిక్కుడు రూ.48, చిక్కుడు రూ.100, దోస రూ. 34, చామదుంప రూ. 48, బీట్‌రూట్ రూ. 38, కీర దోస రూ. 40, బీన్స్ రూ.70, అల్లం రూ.130, క్యాప్సికం రూ.70, ఆకాకర రూ.120, అనప ఒక్కింటికి రూ.25, అరటి ఒక్కటి రూ.7, పాలకూర, చుక్కకూర, మెంతుకూర, తోటకూర కట్ట రూ.10, పొట్లకాయ రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

కామవరపుకోట, సెప్టెంబరు 26 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.విజయబాబు తెలిపారు. గురువారం కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి మొక్కలు నాటారు. మై భారత్ లోగోతో కూడిన క్యాప్స్, బుక్స్, పెన్నులు, విద్యార్థులు, సిబ్బందికి అందచేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, దారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, విజయకృష్ణ, ఉమా పాల్గొన్నారు.

ఏపీ ట్రైకార్ చైర్మన్‌కు నేతల అభినందనలు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 26: ఏపీ ట్రైకార్ చైర్మన్, టీడీపీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసును టీడీపీ మండల నాయకులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. పార్టీని కష్టకాలంలో నడిపేందుకు కృషి చేసిన శ్రీనివాస్‌కు తగిన ప్రాధాన్యం ఇస్తూ సీఎం తీసుకున్న నిర్ణయంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కామయ్యపాలెం, దర్భగూడెం, స్వర్ణవారిగూడెం, ములగలంపల్లి నాయకులు పలువురు ఉన్నారు.

చాకలి ఐలమ్మ జీవితం ఆదర్శం : ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, సెప్టెంబరు 26: వీరనారి చాకలి ఐలమ్మ జీవితాన్ని బడుగు బలహీన వర్గాలతో పాటు రజకులు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గొల్లగూడెంలో చాకలి ఐలమ్మ జయంతిని గురువారం నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే, రజక సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కరపా వెంకట శ్రీనివాసరావు, ఎంపీటీసీ గద్దే మంగేష్, జొన్నాడ శ్రీనివాస్, పల్లంట్ల రాంబాబు, పిప్పర ప్రసాద్, వెల్లుటి శ్రీనివాస్, అంజూరి శ్రీనివాస్, కొత్తపల్లి శ్రీనివాస్, కృష్ణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులు రూ.90 వేలు రికవరీ చేయాలి

భీమడోలు, సెప్టెంబర్ 26: ఉపాధిహామీ పథకంలో అవకతవకలు గుర్తించిన రూ.90 వేలను రికవరీ చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు ఎ రాము తెలిపారు. మండలంలో రూ.12.98 కోట్ల విలువైన 1589 పనులు నిర్వహించారు. సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఉపాధి హామీ పథకం పీవో పద్మావతి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. జిల్లా విజిలెన్సు అధికారి విజయలక్ష్మి, భీమడోలు ఎంపీపీ రామయ్య భీమడోలు ఏపీవో పద్మా, సామాజిక తనిఖీల సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం రూ. 3.11 లక్షలు

కామవరపుకోట, సెప్టెంబరు 26: తెలుగుదేశం పార్టీ నేతలు కోనేరు వెంకట సుబ్బారావు, ఘంటా సుధీర్‌బాబు, నెక్కలపు సూర్యనారాయణ, చదలవాడ నాని, గంగాధర్, డాన్ దివాకర్, బొబ్బిలి నాగు, మధు, కాంతారావు, కొండూరి సురేష్, రాజా, రామకృష్ణ, శ్రీధర్, పత్తి కుమార్ రూ.3,11 లక్షలు సేకరించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు గురువారం అందచేసినట్టు టీడీపీ నాయకులు తెలిపారు.

● నిడమర్రు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నిడమర్రు రైతులు విరాళం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయకుమారి రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే ధర్మరాజుకు అందజేశారు. తోకలపల్లి గ్రామానికి చెందిన ముదునూరి సూర్యనారాయణ రూ. 50 వేల డీడీ ఎమ్మెల్యే ధర్మరాజుకు అందజేశారు.

దూర విద్యా విధానంలో టెన్త్, ఇంటర్

లింగపాలెం, సెప్టెంబరు 26: దూరవిద్య విధానం ద్వారా టెన్త్, ఇంటర్ చదువుకోడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంఈవో జంగం రవీంద్ర తెలిపారు. సింగగూడెంలో దూర విద్య విధానంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. 10వ తరగతికి 14 ఏళ్లు నిండిన వారు ఇంటర్మీడియట్‌కు 15 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. ఈనెల 28 లోపు ఫీజు చెల్లించాలని, అభ్యర్థులకు ప్రతి ఆదివారం తరగతులు ఉంటాయని ఆయన తెలిపారు. హెచ్ఎం బుర్రా శ్రీధర్, సీఆర్పీలు కుమార్ మంగళం, కనకరాజు, పలువురు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

జీలుగుమిల్లి/బుట్టాయగూడెం, సెప్టెంబరు 26: ఆన్‌లైన్‌లో నగదు లావాదేవీలు జరిగే క్రమంలో సైబర్ నేరగాళ్ల మోసాలకు బలి కాకుండా అవగాహన కలిగి ఉండాలని సీఐ బి.వెంకటేశ్వరావు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో పరిచయాలు పెంచుకోకూడదని బుట్టాయగూడెం ఎస్సై దుర్గా మహేశ్వరావు తెలిపారు. కోయరాజమండ్రి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల, అంతర్వేదిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, అపరిచితులతో పరిచయాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు.

ఏపీటీడీసీ చైర్మన్‌ను కలసిన యాదవ సంఘ నేతలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26: ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసారి బాలాజి యాదవ్‌ను జిల్లా యాదవ సంఘనేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. కూరాకుల బుజ్జియాదవ్, కాట్రు బాలకృష్ణ, మాగంటి మురళీకృష్ణ తదితరులు ఏపీ సెక్రటేరియట్‌లో ఆయనను కలిసి శాలువా కప్పి, శ్రీకృష్ణుని చిత్రపటం ఇచ్చి సత్కరించారు.

జిల్లాలో పలు చోట్ల వర్షాలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 26: జిల్లాలో పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుఝామున వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో కలిదిండి మండలంలో 15.4 మిల్లీ మీటర్ల వర్షపాతం, జిల్లాలో సరాసరి 2.3 మి.మీ నమోదైంది. ముదినేపల్లి 11.6, మండవల్లి 9.6, దెందులూరు, ఉంగుటూరుల్లో 3.8, నిడమర్రు 2.8, కైకలూరు 2.4, ఆగిరిపల్లి 2.2, ద్వారకా తిరుమల 2, కుక్కునూరు 2 మి.మీ వర్ష పాతాలు నమోదయ్యాయి.

టీడీపీ సభ్యత్వ నమోదుపై సమావేశం

కామవరపుకోట, సెప్టెంబరు 26: టీడీపీ సభ్యత్వ నమోదుపై క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో టీడీపీ అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ గురువారం సమావేశం నిర్వహించారు. పార్టీపై ప్రజల్లో ఆదరణ పెరిగిందని, అన్ని వర్గాల ప్రజల నుంచి సభ్యత్వాలను స్వీకరించాలని చెప్పారు. ఏలూరు పార్లమెంటు కోఆర్డినేటర్ వాకా కళ్యాణ శివకుమార్ సూచనలు ఇచ్చారు. టీడీపీ నాయకులు సిరిగిబత్తుల నాగరాజు, సర్పంచ్‌లు గోరింక దాసు, వేముల నాగేశ్వరరావు, పసుమర్తి పార్థసారధిబాబులతోపాటు మద్దిపోటి నాగ లింగేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో దాతలు భాగస్వాములు కావాలి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 26: సేవా కార్యక్రమాల్లో దాతలు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు కొనకళ్ళ కుమార్‌గుప్తా, రాధారాణి దంపతులు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో రేకుషెడ్డు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలను ఎమ్మెల్యే బడేటి చంటి గురువారం ప్రారంభించారు. అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు కెకె గుప్తా మాట్లాడుతూ నగరంలో సేవా కార్యక్రమాలకు సహకరిస్తామన్నారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ సీహెచ్ సుధాకర్, డాక్టర్ మల్లికార్జున రాజు, ఆర్ఎంవో దుర్గాకుమార్, డాక్టర్ ఎఎస్ రామ్, డాక్టర్ బంకా రవి కుమార్, చోడే వెంకటరత్నం, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు దివ్వెల జయ ప్రకాష్, వాసవి సుబ్బారావు, మద్దుల రవికుమార్, బచ్చు విష్ణు, వేమా కోటేశ్వరరావు, తడికమళ్ళ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి హరదీప్ ఆచూకీ కనుగొనండి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 26: ఆశ్రం వైద్య కళాశాల విద్యార్థి సీహెచ్.హరదీప్ ఆచూకిని కనుగొనాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఎస్పీని కోరారు. ఈ నెల 22న మారేడుమిల్లి జలతరంగిణి వాగులో ముగ్గురు విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. 23న ఇద్దరి మృతదేహాలు లభ్యం కాగా హరదీప్ ఆచూకీ తెలియలేదు. హరదీప్ తల్లిదండ్రులు గురువారం ఎంపీ మహేశ్‌ను కలిసి హరదీప్ ఆచూకీ కనుగొనాలని విజ్ఞప్తి చేశారు. అటవీ అధికారులు, పోలీస్ అధికారులు గాలింపు చర్యలు విస్తృతం చేశారు.

విధులకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 26: విధులకు వెళ్లిన తన భర్త తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. భగత్‌సింగ్ సెంటర్ సమీపంలో నరం చరణ్‌రాజు భార్య, కుమార్తెతో ఉంటున్నాడు. ఒక ఫైనాన్స్ షాపులో పని చేస్తున్న చరణ్‌రాజు ఈ నెల 18న డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఫైనాన్సు యాజమాన్యాన్ని అడిగితే చరణ్ రాజు సెలవు పెట్టినట్లు తెలిపారు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** రూరల్ మండల పంచాయతీల్లో ఈనెల 28న గ్రామసభలునిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి పద్మావతి సూచించారు. పంచాయతీ సెక్రటరిలకు సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో బండి ప్రణవి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.
- **పెదపాడు :** ఏపూరు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ అప్పనవీడు టౌన్ ఫీడర్, కొక్కిరపాడు సబ్‌స్టేషన్ పరిధిలో, కొక్కిరపాడు ఇండస్ట్రియల్ ఫీడర్, పెదపాడు, గోగుంట ఫీడర్‌ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ వై.రాంబాబు తెలిపారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సమగ్రాభివృద్ధి సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో-1 సబ్బితి నరసింహామూర్తి తెలిపారు. నాయుడుగూడెం ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని, భోజనం పరిశీలించారు.
- **లింగపాలెం :** సుందర్‌రాజుపేట గ్రామానికి చెందిన దాసు కుటుంబానికి మిత్రాదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సందీప్ బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. దాసు కుమార్తె చదువుకు కూడా తాను సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు.
- **ఉంగుటూరు :** హైస్కూలులో పిల్లలకు ఉచిత బస్ పాస్‌లు దాత తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు సహకారంతో బస్ పాసులు ఎమ్మెల్యే ధర్మరాజు పంపిణీ చేశారు.
- ఉంగుటూరు మండల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సత్కరించారు. సర్పంచ్ బందారు సింధు, శరణాల మాలతీరాణి, డీవైఈవో రవీంద్ర భారతి, ఎంపీడీవో రాజ్ మనోజ్ తహశీల్దార్ బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్, ఎంఈవో-2 బాస్కర్, అడపా శోభారాణి పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషును ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పరామర్శించారు.
- ధాన్యం కొనుగోళ్ల కేంద్రంలోనే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని తహసీల్దారు కె.స్లీవజోజి సూచించారు. పంగిడిగూడెంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. జేసీ ఆదేశాల మేరకు రైతులకు అవసరమైన గోనె సంచులను సిద్ధంగా ఉంచామన్నారు. ఏవో కెవిఎస్.పోశారావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.
- **నిడమర్రు :** ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉపాధ్యాయులను, ఆఫీసు సిబ్బందిని ఎమ్మెల్యే సన్మానించారు. ఉపాధ్యాయులు నగిరెడ్డి వెంకట సుబ్బారావు, పి.సుబ్బరాజు, డీవీ.రమణ, సీహెచ్ ఆంటోనిరాణి, ఎస్.సంఘమిత్ర, ఎంఈవోలు పి.శేషు, జి.బాలయ్య, కె.రాంబాబును సత్కరించారు.



మొక్కలు నాటుతున్న డీఆర్వో, జడ్పీ చైర్‌పర్సన్, పారిశుధ్య కార్మికుల ప్రతిజ్ఞ

ఆరోగ్యంగా ఉంటే దేశాభివృద్ధి సాధ్యం

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 26: ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటే దేశాభివృద్ధి సాధ్యమని, స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. బస్టాండ్, జన్మభూమి పార్కుల వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. మానవహారం అనంతరం డీఆర్వో డి.పుష్పమణి స్వచ్ఛ్ భారత్ లక్ష్యంతో కృషి చేస్తామని అందరితో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డీఆర్వో డి.పుష్పమణి తదితరులు మొక్కలు నాటారు. అనంతరం చీపురుపట్టి రోడ్లపై చెత్తను తొలగించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో అక్టోబర్ 2న గాంధీజయంతి వరకు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. చుట్టూ ఉన్న పరిసరాలను అంతే శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనపై ఉందాన్నరు. డీఆర్వో పుష్పమణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, మున్సిపల్ కమిషనరు ఎన్ భాను ప్రతాప్, హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ కె పద్మావతి, డీఎంహెచ్‌వో ఎస్ శర్మిష్ట, డీసీహెచ్ఎస్ పాల్‌సతీష్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్ఎస్ పుష్పలత, సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం ముక్కంటి, పశుసంవర్ధక శాఖ జెడి జి నెహ్రూబాబు పాల్గొన్నారు.

కలిదిండిలో కొలువైన దుర్గమ్మలు



కలిదిండి, సెప్టెంబరు 26 : దసరా మహోత్సవాల్లో భాగంగా దేవీశరన్నవ రాత్రుల్లో పూజలందుకోనేందుకు దుర్గమ్మలు సిద్ధమయ్యారు. సుమారు రెండు అడుగుల నుంచి 10 అడుగులు ఉన్న విగ్రహాలను కలిదిండిలోను, రాష్ట్ర రహదారి పక్కన పెద్దింట్లమ్మ ఆలయ సమీపంలో విక్రయిస్తున్నారు. సైజును బట్టి రూ.3 వేల నుంచి రూ.15 వేలు వరకు ధర పలుకుతుంది.

నేడు మంత్రి పార్థసారథి పర్యటన

చాట్రాయి, సెప్టెంబరు 26: గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం చాట్రాయి మండలంలో పర్యటిస్తారని మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. తుమ్మగూడెం, కొత్తగూడెం, మర్లపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లు శంకుస్థాపన చేస్తారని, అనంతరం మర్లపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ చిత్రపటం అందజేత



తహసీల్దార్‌కు పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని అందజేస్తున్న జనసేన నాయకులు

ముదినేపల్లి, సెప్టెంబరు 26 : ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పటాన్ని ఏర్పాటు చేసేందుకు జనసేన నాయకులు చొరవ చూపించారు. ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసేందుకు జనసేన ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి వేల్పూరి నానాజీ, నాయకులు తణుకుల రవితేజ, భూపాల నాని, కురిశెట్టి నాగేంద్ర, మల్లంపల్లి వీరబాబు తదితరులు పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని గురువారం తహసీల్దార్ సుభానీకి అందజేశారు.

ఆలయాల ఈవోలు బదిలీ

ముదినేపల్లి, సెప్టెంబరు 26: మండలంలోని పలు ఆలయాల కార్యనిర్వహణాధికార్లను బదిలీ చేస్తూ దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వడాలిలోని శ్రీసుభద్ర బలరామ సహిత శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానానికి ఇన్‌చార్జి ఈవోగా వ్యవహరిస్తున్న కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసరావును రెగ్యులర్ ఈవోగా నియమిస్తూ ఆయనకు గురజ వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి, అల్లూరు సోమేశ్వరస్వామి, చేవూరు లక్ష్మీనారాయణస్వామి, వడాలి విశ్వేశ్వర స్వామి దేవస్థానాల అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. సింగరాయ పాలెం బావాజీ మఠం ఈవో పి.యేసునాయుడును పశ్చిమగోదావరి జిల్లా తోలేరు శ్రీకేశవ, విఘ్నేశ్వర దేవస్థానం ఈవోగా బదిలీ చేశారు.

చోరీలపై ప్రజలకు అవగాహన

నూజివీడు టౌన్, సెప్టెంబరు 26: ఆన్‌లైన్ మోసాలు, దోపిడీ, చైన్ స్నాచింగ్‌లపై నూజివీడు పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తూ గురువారం పట్టణంలో మైక్ ప్రచారం నిర్వహించారు. నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ ఆదేశాలతో ఈప్రచారాన్ని నిర్వహించగా అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్ఐ బేగ్ సూచించారు.

స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికలు రూపొందించండి



అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి వెంకటరత్నం

చాట్రాయి, సెప్టెంబరు 26: విజన్ స్వర్ణాంధ్ర-2047 కోసం గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని అన్ని శాఖల అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరత్నం కోరారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన అన్ని శాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలకు పూర్తి స్థాయి మౌలిక వసతులు, చెట్ల పెంపకం, సాగు, తాగునీరు, వ్యవసాయం మొదలైన అంశాలను దృష్టి పెట్టుకొని ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దుర్గాప్రసాద్, ఎంఈవో బ్రహ్మాచారి, ఏపీవో లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

ముదినేపల్లి, సెప్టెంబరు 26 : ఉమ్మడి ఏపీ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ నాయకుడు బూరగడ్డ వేదవ్యాస్ పుట్టిన రోజు సందర్భంగా ముదినేపల్లిలోని మనోజ్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. స్థానిక ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ, ఇన్‌స్ట్రక్టర్లు మణి భీమరాజు, బోయిన కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ గంధం నాగ వెంకట శివ తదితరులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఘనంగా ఐలమ్మ జయంతి



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూటమి నేతలు, రజక సంఘం నాయకులు

కైకలూరు, సెప్టెంబరు 26: స్వాతంత్ర్య సమరయోధులు చిట్యాల ఐలమ్మ 129వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ ఐలమ్మ రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో కైకలూరు-కోరుకొల్లు రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఐలమ్మ చిత్రపటానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాల్లో చేర్చాలని, రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కోరారు. అలాగే రజకులు వృత్తి చేసుకునేందుకు చెరువులపై శాశ్వత హక్కులను వారికే కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పూల రామచంద్రరావు, బొమ్మనబోయిన విజయలక్ష్మీ, పోలవరపు లక్ష్మీరాణి, వీరాబత్తిన సుధా, గంగునేని వరప్రసాద్, రజక సంఘం నాయకులు గుడికందుల ఏసురత్నం, అంతర్వేది పెద్దిరాజు, చిర్లంక శ్రీనివాసు, గోల్కొండ చంటి, కొండపల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి ఎంతో ప్రాధాన్యత



పర్యాటక దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత

కైకలూరు, సెప్టెంబర 26: ఆధునిక ప్రపంచంలో పర్యాటక రంగానికి ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుజాత అన్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ కళాశాలలో గురువారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని కళాశాల చరిత్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక, శాంతి అనే థీమ్‌గా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో హిస్టరీ అధ్యాపకుడు డాక్టర్ ఎం.హరికిరణ్, అధ్యాపకులు డాక్టర్ బి.వేదాంతం, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో అన్నదాతల ఆందోళన



వరి పొలాల్లో చేరిన వర్షపు నీరు

కలిదిండి, సెప్టెంబరు 26 : బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలలో సార్వా సాగులో రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాల్లో నీరును ఆయిలింజన్లతో బయటకు తోడుకుంటున్నారు. ఆవకూరు, కొచ్చెర్ల, కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు, వరదల వల్ల వరి పైరు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయారు. మళ్లీ ఇప్పుడు అల్పపీడనం కారణంగా వర్షాలు భారీగా కురిస్తే ఆరుగాలం శ్రమించిన వరి పంట చేతికి వస్తోందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలతో చేపల, రొయ్యల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరత ఏర్పడటంతో చేపలు, రొయ్యలు నీటిపై తేలాడుతుండటంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. రేయింబవళ్లు నిరంతరాయంగా చెరువుల్లో ఏరియేటర్లు తిప్పుతున్నారు. విద్యుత్ కోత విధిస్తే ప్రత్యామ్నాయంగా అద్దె జనరేటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎకరానికి రెండు లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. చేపలు, రొయ్యలు చేతికి వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

అడుగడుగునా గోతులే..



వడాలి వద్ద చెరువులా మారిన ప్రధాన రహదారి

ముదినేపల్లి, సెప్టెంబరు 26 : రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ముదినేపల్లి మండలంలోని ప్రధాన రహదారులు చిన్నపాటి చెరువుల్లా తయారయ్యాయి. ముదినేపల్లి - భీమవరం స్టేట్ హైవేలో సుమారు 14 కిలోమీటర్ల దూరం అడుగడుగునా గోతులమయంగా మారింది. వడాలి, స్తంభం చెరువు, సింగరాయపాలెం సెంటర్, గ్రోవెల్ కంపెనీ నుంచి బొమ్మినంపాడు వరకు ఈ రోడ్డు వర్షాలకు ధ్వంసమై వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉన్నాయి. లోడు వాహనాలు, లారీలు రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతుల్లోని నీళ్లల్లో దిగబడిపోతున్నాయి. వడాలి వద్ద రెండు కిలోమీటర్ల దూరం పెద్ద గోతులు ఏర్పడి నీళ్లు నిలిచాయి. గోతుల్లోని నీటిని రోడ్డు పక్కనే ఉన్న డ్రైన్‌లో పంపేందుకు ఆర్ అండ్ బీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. సుమారు వారం రోజుల వరకు గోతుల్లోని నీరు తగ్గే పరిస్థితి కనిపించటం లేదు. ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు మార్గమే లేకుండాపోయింది. సింగరాయపాలెంలో ఏర్పడిన గొయ్యి రెండు సంవత్సరాల నుంచి పెద్దదై ప్రమాదకరంగా మారినప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప పూడ్చించేందుకు ఒక ట్రక్కు మట్టి కూడా వేయలేకపోతున్నారు.

రహదారి గండి పూడ్చివేత



కోతకు గురైన రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ముసునూరు, సెప్టెంబరు 26: ముసునూరు నుంచి వలసపల్లి వెళ్ళే ఆర్ అండ్‌బీ రహదారి సుబ్బయ్యకుంట వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై గండిపడింది. ఆర్అండ్‌బీ ఏఈ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో రూ రెండు లక్షల నిధులతో గండి పూడ్చి వేసే పనులు చేపట్టారు. ఎక్స్‌కోవేటర్‌తో రహదారికి పడిన గండిలో ఉన్న మట్టిని తొలిగించి, నాలుగు సిమెంట్ తూరలు వేసి, గ్రావిల్ పోసి చదును చేశారు. దీంతో ఈ ప్రధాన రహదారిలో రాకపోకలు పునఃప్రారంభమైయ్యాయి.

చెరువు గండ్లను యుద్ధ ప్రాతిపదిక పూడ్చాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 26: భారీ వర్షాలకు చెరువులకు పడిన గండ్ల ను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే ఎం.వెంకట ప్రతాప్ అప్పారావు నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరీకి విజ్ఞప్తి చేశారు. నూజివీడు పట్టణంలోని పెద్ద చెరువుకు పడిన గండిని ఆయన గురువారం పరిశీలించారు. నూజివీడు మాజీ వైస్ చైర్మన్ పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని హిందువులే కాపాడుకోవాలి



మండవల్లిలో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ



కైకలూరులో హోమ పూజలు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

మండవల్లి, సెప్టెంబరు 26: సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసినందుకు నిరసనగా హిందుధర్మ పరిరక్షణ సమితి, షిర్డీ సాయి భక్త సమాజం ఆధ్వర్యంలో కన్వీనర్ గుడివాడ చిట్టిబాబు, గురుస్వాములు వై.శ్రీనివాసరావు, ఎల్.వెంకట చలపతిరావు, ఆధ్వర్యంలో గురువారం మండవల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కీర్తి వెంకటరాంప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆలయాలను ఎండోమెంట్ నుంచి హిందూ ధార్మిక సంఘాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. షిర్డిసాయిబాబా భక్త బృందం కన్వీనర్ గుడివాడ చిట్టిబాబు మాట్లాడుతూ స్వామివారి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన సంఘట నపై సీబీఐ ఎంక్వేయిరీ చేయించాలని కోరారు. గురు స్వామి ఆజాద్, బీజేపీ మండవల్లి మండల అధ్యక్షుడు నాయకులు ఏసుబాబు, జనసేన నాయకులు రవితేజ, గురుస్వాములు రాంబాబు, నాని,రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ నాయకులు హోమ పూజలు

కైకలూరు, సెప్టెంబర 26: లడ్డూ అపవిత్రం అయిన కారణంగా కైకలూరు జనసేన పార్టీ నాయకులు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో ప్రాయశ్చిత మహాచండీ యాగం నిర్వహించారు. గురువారం కైకలూరు శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి అనంతరం శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో హోమపూజలను చేశారు. పూజా కార్యక్రమాల్లో జనసేన పార్టీ నాయకులు కొల్లి వరప్రసాద్, నల్లగోపుల చలపతి వేదమంత్రాల మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించగా కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులు ఎక్కడ మాస్టారూ..



శ్రీహరిపురం పాఠశాలను తనిఖీ చేస్తున్న సర్పంచ్ విశ్వేశ్వరరావు

ముదినేపల్లి, సెప్టెంబరు 26 : శ్రీహరిపురం ఎలిమెంటరీ పాఠశాలల్లో ఒక్క టీచర్ కూడా లేకపోవడంతో సర్పంచ్ పరసా విశ్వేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పాఠాలు ఎవరు బోధిస్తారు, రోజూ వచ్చే టీచరు ఎక్కడ అంటూ ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన గురువారం పాఠశాలను సందర్శించారు. 22 మంది విద్యార్థులున్నప్పటికీ ఒక్క రెగ్యులర్ ఉపాధ్యాయుడు కూడా లేకపోవడం దారుణమన్నారు. గతంలో ముగ్గురు ఉపాధ్యాయులున్న ఈ పాఠశాలలో ఒక ఉపాధ్యాయిని మెటర్నరీ లీవులో ఉండగా, మరోకరు చినకామనపూడి పాఠశాలకు సర్దుబాటు ప్రక్రియలో డెప్యూటేషన్‌పై పంపారు. హెచ్ఎం ఇటీవల మెడికల్ లీవులో వెళ్లిపోయారు. ఇదంతా ఏమి టి, విద్యాశాఖ అధికారులు ఏం చేయాలనుకుంటున్నారు అంటూ సర్పంచ్ విశ్వేశ్వరరావు ధ్వజమెత్తారు. కొంతకాలం సీఆర్పీ, మరి కొన్ని రోజులు వేరే ఉపాధ్యాయుడిని తాత్కాలికంగా ఈ పాఠశాలకు పంపటం ఏమిటని ఫోన్‌లో మండల విద్యాశాఖాధికారిని సర్పంచ్ ప్రశ్నిస్తూ, వెంటనే రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించకపోతే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసు కెళ్తానని స్పష్టం చేశారు. మధ్యాహ్నం భోజన పథకం అమలును పరిశీలించారు.

నిరుపయోగంగా భవనాలు



పర్వతాపురంలో నిరుపయోగంగా ఉన్న వీఆర్వో కార్యాలయ భవనం

చాట్రాయి, సెప్టెంబరు 26: రెవెన్యూ కార్యాలయాల కోసం ఐదేళ్ల క్రితం మూడు గ్రామాల్లో రూ.12 లక్షలతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా కలెక్టర్‌గా విజయ కృష్ణన్ ఉండగా చాట్రాయి, పర్వతాపురం, సోమవరం గ్రామాల్లో వీఆర్వో కార్యాలయ భవనాల నిర్మాణానికి, ఒక్కో భవనానికి రూ.4 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. భవనాలు నిర్మించి ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు చేశారు కానీ, వీఆర్వోలు ఆ భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో తలుపులు కిటికీలు శిధిలావస్థకు చేరుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాలను అంగన్వాడీ కేంద్రాలకు గాని, పశువుల ఆస్పత్రులకు గాని, ఇతర ప్రభుత్వ కార్యకలాపాలకు గాని కేటాయించి ప్రజా ధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టాయిలెట్ ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



టాయిలెట్ బాక్సు ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటున్న స్థానికులు

కైకలూరు, సెప్టెంబర్ 26: శ్రీషిర్డి సాయి ధ్యాన మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మరుగుదొడ్డిని స్థానికులు అడ్డుకున్నారు. బాబా మందిరం సమీపాన పంట కాలువ గట్టుపై ధ్యాన మందిర కమిటీ సభ్యులు గురువారం టాయిలెట్ బాక్సును ఏర్పాటు చేసి దాని నుంచి పైపులైన్లను సమీపాన ఉన్న డ్రైన్లలోకి పంపేందుకు ప్రయత్నించారు. దీంతో స్థానికంగా కాలువగట్టుపై నివసిస్తున్న ప్రజలు తమ ఇళ్ల ముందు టాయిలెట్ బాక్సు ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ధ్యాన మందిరం కమిటీ సభ్యులు, మహిళా సేవకులు, స్థానికుల మధ్య మాటమాట పెరిగి వివాదానికి దారితీసింది. ఈ సంఘటన తెలుసుకున్న కైకలూరు టౌన్ పోలీసులు పంచాయతీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువురిని సముదాయించి ఈ టాయిలెట్ బాక్సును మరోకచోట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనితో వివాదం సద్దుమనిగింది.

రోడ్డు మార్జిన్ తవ్వి.. తోటకు రక్షణగా గట్టు



ముసునూరు, సెప్టెంబరు 26: గుడిపాడు ప్రధాన రహదారి మార్జిన్‌ను గురువారం ఒక రైతు తవ్వి తోటకు రక్షణగా గట్టు పోయడంపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు బొప్పన శ్రీనివాస రావు ఎక్స్‌కోవేటర్‌తో సుమారు వంద మీటర్ల పొడవున ఆర్అండ్‌బీ రహదారి మార్జిన్‌ను అక్రమంగా తవ్వి మట్టిని తన తోటకు గట్టుగా పోసుకున్నాడు. దీంతో రహదారికి మార్జిన్ లేని పరిస్థితి నెలకొందని, వాహనదారులు రోడ్డు దిగితే ప్రమాదానికి గురైనట్టేనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రదేశంలోనే ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి ఒక వ్యక్తి మృతి చెందాడని, మార్జిన్‌ను అక్రమంగా తవ్వితే భవిష్యత్‌లో పలు ప్రమాదాలు జరిగే ఆవకాశం ఉంది. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. రోడ్డు మార్జిన్ అక్రమ తవ్వకంపై ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఏఈ అశోక్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆర్అండ్‌బీ రహదారి మార్జిన్ ఉన్నంత వరకు అక్రమణను తొలిగించి, కంతకాన్ని పూడ్చివేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధికి బాటలు







నూజివీడు, కలిదిండి భాస్కరావుపేట, కైకలూరు వెలమపేటలో నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

ముసునూరు, సెప్టెంబరు 26: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేస్తోందని టీడీపీ నాయకులు లక్కపాము కాంతరావు, నక్కా చెన్నారావు అన్నారు. సూరేపల్లి, లోపూడి గ్రామాల్లో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన పథకాలు, జరిగిన అభివృద్ధి గురించి టీడీపీ నాయకులు, అధికారులు ప్రజలకు వివరించి, ప్రతి ఇంటికి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలన విధానాలతో రాష్ట్రం అప్పులపాలై, అభివృద్ధి జాడలేదన్నారు. ఆర్థిక సంక్షోభంలోనూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విడల వారిగా అమలు చేస్తోందన్నారు. సీఎంగా చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందటంతోపాటు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు జరుగుతాయని నాయకులు పెర్కొన్నారు. టీడీపీ నాయకులు పి.వెంకటరత్నం, డాక్టర్ గంగాధర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : పట్టణంలోని గాంధీనగర్ - 2 సచివాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వంద రోజులుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, ఆర్థిక స్వాలంబన జరిగిన విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో 26, 27, 28 వార్డుల టీడీపీ, జనసేన నాయకులు ఆర్.రంగారావు, ఎం. శ్రీనివాసరావు, ఎం.రామరాజు, ఎం.కామేష్, తదితరులు పాల్గొన్నారు.

● కలిదిండి : భాస్కరావుపేటలో టీడీపీ నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు వేగిరెడ్డి చిన్నారావు, పోకల ప్రసాద్, పిళ్లారిశెట్టి వేణు, జక్కుల పౌల్ రాజ్, థామస్, ఆరోహన్, జయకుమార్, చొప్పా సత్యనారాయణ పాల్గొన్నారు.

● కైకలూరు : సంక్షేమ పాలన అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని నియోజకవర్గ కోకన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మీ అన్నారు. కైకలూరు వెలమపేట కాలనీలోని 122వ బూత్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వంద రోజుల పాలనను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువచ్చిందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి పోలవరపు లక్ష్మీరాణి, టీడీపీ నేతలు బంకపల్లి భాస్కరరావు, బంకపల్లి సీతమ్మ, వేముపల్లి కారుణ్య, నాగిరెడ్డి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు గురుకుల బాలికలు



ఎంపికైన బాలికలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ముసునూరు, సెప్టెంబరు 26: ముసునూరు గురుకుల పాఠశాల బాలికలు డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపాల్ కె.ప్రవీణ తెలిపారు. అండర్-14, 17 కబడ్డీ విభాగంలో 13 మంది, ఖోఖోలో నలుగురు, వాలీబాల్‌లో ఆరుగురు, షటిల్‌లో ముగ్గురు, యోగాలో ఏడుగురు, చెస్ విభాగంలో ఒకరు జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయిని జి.నాగమల్లేశ్వరి తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు అందజేత



నూజివీడు టౌన్, సెప్టెంబరు 26: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నూజివీడు నెహ్రూపేట సచివాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 10, 19, 20 వార్డుల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి మోచర్ల కృష్ణంరాజు, ఇళయరాజా, శానిటరీ ఇనస్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

పోలీసుల పల్లె నిద్ర

ముదినేపల్లి, సెప్టెంబరు 26 : ఊటుకూరులో బుధవారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర చేశారు. ఈ నెల 7న ఆ గ్రామంలో జరిగిన హత్య కేసు నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ నేటికీ కొనసాగుతుంది. ఇందులో భాగంగా ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలో పల్లె నిద్ర చేసి గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సహకరించాలని ఎస్ఐ గ్రామస్థులను కోరారు.

ప్రభుత్వానికి మద్దతుగా నిలుద్దాం..



విఠల్‌ను అభినందిస్తున్న పార్టీ నాయకులు

ముదినేపల్లి, సెప్టెంబరు 26 : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మద్దతుగా నిలవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరు విఠల్ అన్నారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన సందర్భంగా గురువారం ఆయన్ని ముదినేపల్లి మండలం కాకరవాడ గ్రామంలో పార్టీ నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఇంటి రామచంద్రరావు తదితరులు విఠల్‌ను అభినందించారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు



అక్కిరెడ్డిగూడెంలో పొలంబడి కార్యక్రమంలో అధికారులు

ముసునూరు, సెప్టెంబరు 26: సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. అక్కిరెడ్డిగూడెంలో గురువారం పొలంబడి కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో వరి పంటలను పరిశీలించి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలు, ప్రభుత్వ సబ్సిడీ పథకాలు తదితర వాటి గురించి రైతులకు ఏవో వివరించారు. ఘనామృతం, జీవామృతం తయారు చేసే విధానాన్ని చేసి చూపించారు. ఈ కార్యాక్రమంలో సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, టీడీపీ నాయకులు బర్మా శ్రీనివాసరావు, మానురాజు సురేష్, వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి హరదీప్ ఆచూకీ కనుగొనండి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 26: ఆశ్రం వైద్య కళాశాల విద్యార్థి సీహెచ్.హరదీప్ ఆచూకిని కనుగొనాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఎస్పీని కోరారు. ఈ నెల 22న మారేడుమిల్లి జలతరంగిణి వాగులో ముగ్గురు విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. 23న ఇద్దరి మృతదేహాలు లభ్యం కాగా హరదీప్ ఆచూకీ తెలియలేదు. హరదీప్ తల్లిదండ్రులు గురువారం ఎంపీ మహేశ్‌ను కలిసి హరదీప్ ఆచూకీ కనుగొనాలని విజ్ఞపి చేశారు. అటవీ అధికారులు, పోలీస్ అధికారులు గాలింపు చర్యలు విస్తృతం చేశారు.

శ్రీహరిపురంలో వేడుకగా సీమంతం

ముదినేపల్లి, సెప్టెంబరు 26 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలో గురువారం గర్భిణులకు సీమంతం వేడుకలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సిహెచ్.ప్రసన్న ఆధ్వర్యంలో శ్రీహరిపురం సెక్టార్ పరిధిలోని గర్భిణులకు సీమంతం చేశారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావుతోపాటు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.